తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న ' తరంగాలు ' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్
94949 23460

https://epaper.tharangalu.in
RNI. TELTEL / 2022 / 83463
జాతీయ దిన ప్రతిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
బుధవారం
11 మార్చి 2026
సంపుటి 102
సంచిక 3
పేజీలు 8
వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh
Epaper: www.tharangalu.in.com

# గ్రామీణ గృహాలకు స్థిరమైన తాగునీటి సరఫరా లక్ష్యం

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- జల్ జీవన్ మిషన్‌పై కేబినెట్ కీలక నిర్ణయం
- మౌలిక వసతుల నుంచి సేవల అందింపుపై దృష్టి
- గ్రామీణ మహిళల సాధికారతకు తోడ్పాటు

న్యూఢిల్లీ, 10 మార్చి (తరంగాలు ప్రతినిధి): దేశవ్యాప్తంగా గ్రామీణ గృహాలకు స్థిరమైన తాగునీటి సరఫరా అందించేందుకు కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. జల్ జీవన్ మిషన్ కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేస్తూ తీసుకున్న ఈ నిర్ణయం గ్రామీణ ప్రజలకు పెద్ద ఉపశమనం కలిగిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు మౌలిక వసతుల సృష్టిపైనే దృష్టి పెట్టిన ఈ పథకం ఇకపై ప్రజాకేంద్రిత సేవల అందింపుపై దృష్టి సారించనుందని ప్రధానమంత్రి చెప్పారు. స్థానిక పాలన వ్యవస్థల భాగస్వామ్యంతో పాటు డిజిటల్ పర్యవేక్షణ ద్వారా తాగునీటి సరఫరా వ్యవస్థను మరింత సమర్థంగా అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయం



దేశంలో నీటి భద్రతను బలోపేతం చేయడమే కాకుండా ప్రజల ఆరోగ్య పరిస్థితులను కూడా మెరుగుపరుస్తుందని ఆయన అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రమైన తాగునీరు అందడం వల్ల ఆరోగ్య సమస్యలు తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ మహిళల సాధికారతకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని మోదీ తెలిపారు. ఇంటి వద్దే తాగునీటి సౌకర్యం కల్పించడం ద్వారా మహిళల శ్రమ తగ్గి వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు.



# తెలంగాణ కొత్త గవర్నర్‌కు ఘన స్వాగతం

- హైదరాబాద్ చేరుకున్న శివ ప్రతాప్ శుక్లా
- విమానాశ్రయంలో ముఖ్యమంత్రి స్వాగతం
- మంత్రులు, ఉన్నతాధికారుల హాజరు

హైదరాబాద్, 10 మార్చి (తరంగాలు ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రానికి నూతన గవర్నర్‌గా నియమితులైన శివ ప్రతాప్ శుక్లా హైదరాబాద్‌కు చేరుకున్నారు. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వాగతం పలికారు. రాష్ట్రానికి వచ్చిన నూతన గవర్నర్‌కు ఘనంగా స్వాగతం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కూడా గవర్నర్‌కు స్వాగతం తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు, రాష్ట్ర పోలీసు మహానిర??కుడు బి. శివధర్ రెడ్డి తదితర ఉన్నతాధికారులు కూడా విమానాశ్రయంలో గవర్నర్‌ను ఆహ్వానించారు. పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు. నూతన గవర్నర్ రాష్ట్రానికి చేరుకోవడంతో రాజ్ భవన్‌లో అధికారిక కార్యక్రమాలు త్వరలో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. రాష్ట్ర పరిపాలనకు సంబంధించిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొననున్నారు.

తెలంగాణకు కొత్త గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించనున్న నేపథ్యంలో రాష్ట్ర రాజకీయ వర్గాల్లో కూడా ఆసక్తి నెలకొంది. త్వరలో అధికారిక ప్రమాణ స్వీకారం జరిగే అవకాశం ఉందని సమాచారం.

# సీబీఎస్ఈ గణిత ప్రశ్నాపత్రంలో క్యూఆర్ కోడ్ వివాదం

- యూట్యూబ్ పాటకు లింక్ అయిన క్యూఆర్ కోడ్
- పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం అంటూ విమర్శలు
- సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్



న్యూఢిల్లీ, 10 మార్చి (తరంగాలు ప్రతినిధి):: సీబీఎస్ఈ 12వ తరగతి గణిత పరీక్ష ప్రశ్నాపత్రంపై వివాదం నెలకొంది. ప్రశ్నాపత్రంలో ముద్రించిన ఒక క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగా యూట్యూబ్‌లోని ఒక పాటకు సంబంధించిన వీడియో తెరుచుకుంటోందని విద్యార్థులు పేర్కొంటున్నారు. ఈ విషయాన్ని ఒక విద్యార్థిని వివరించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో పరీక్షల నిర్వహణపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైరల్ వీడియోలో ఒక విద్యార్థిని ప్రశ్నాపత్రంలో ఉన్న క్యూఆర్ కోడ్‌ను చూపిస్తూ అది యూట్యూబ్‌లోని ఒక పాటకు సంబంధించిన లింక్‌కు తీసుకెళ్తోందని చెబుతోంది. పరీక్షల నిర్వహణలో అధికారులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో చెప్పడానికి ఇది ఉదాహరణ అని ఆమె వ్యాఖ్యానించింది. ఈ ఘటనపై పలువురు సామాజిక మాధ్యమాల్లో స్పందిస్తూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రశ్నాపత్రాల తయారీ, ముద్రణ ప్రక్రియలో ఇలాంటి తప్పిదాలు ఎలా జరిగాయన్నదానిపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. విద్యార్థుల భవిష్యత్తుకు కీలకమైన పరీక్షల్లో ఇలాంటి ఘటనలు జరగడం తగదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటనపై సీబీఎస్ఈ అధికారికంగా స్పందించాల్సి ఉందని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రశ్నాపత్రాల తయారీ ప్రక్రియలో మరింత జాగ్రత్తలు తీసుకోవాలని విద్యావర్గాలు సూచిస్తున్నాయి.



# కళాశాలలకు ప్రభుత్వం షాక్..

- ట్యూషన్ ఫీజు తప్ప మరో రుసుము వసూలు చేయరాదు
- ఇంజనీరింగ్, ఫార్మసీ, లా తదితర కోర్సుల ఫీజుల్లో మార్పులు
- స్పెషల్ ఫీజులు, అడ్మిషన్ ఫీజుల వసూళ్లకు అడ్డుకట్ట
- విద్యార్థులపై అదనపు భారం తగ్గించడమే లక్ష్యం

హైదరాబాద్, 10 మార్చి (తరంగాలు ప్రతినిధి):

రాష్ట్రంలో ఇంజనీరింగ్, ఫార్మసీ, లా, బీఈడీ, ఎంబీఏ, ఎంసీఏ వంటి కోర్సుల ఫీజులను ఇటీవల భారీగా తగ్గించిన ప్రభుత్వం తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ట్యూషన్ ఫీజు తప్ప అదనంగా ఇతర ఎలాంటి రుసుములు వసూలు చేయకూడదని కొత్త నిబంధనను తీసుకొచ్చింది. ఈ మేరకు ప్రభుత్వం విడుదల చేసిన కొత్త ఫీజుల ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఇప్పటివరకు కళాశాలలు ట్యూషన్ ఫీజుతో పాటు ప్రత్యేక రుసుములు, అడ్మిషన్ ఫీజుల పేరుతో విద్యార్థుల నుంచి అదనంగా వసూలు చేస్తున్నాయి. గతంలో ట్యూషన్ ఫీజుతో పాటు రూ.8,500 వరకు ఇతర రుసుములను వసూలు చేసుకునే అవకాశం ఉండేది. అయితే కొత్తగా జారీ చేసిన ఉత్తర్వుల్లో ఈ అదనపు ఫీజుల ప్రస్తావనను ప్రభుత్వం పూర్తిగా తొలగించింది. ప్రత్యేక ఫీజుల పేరిట కళాశాలలు అనధికారికంగా ఎక్కువ మొత్తంలో

➤ మిగతా 2వ పేజిలో..



# పశ్చిమాసియాలో యుద్ధం పదోరోజు

➤ 2వ పేజిలో..

# జగిత్యాల రాజకీయాల్లో కలకలం..

- కాంగ్రెస్‌లో కొనసాగాలా? వద్దా? త్వరలో నిర్ణయం
- ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు ప్రాధాన్యతపై అసంతృప్తి
- అనుచరులతో చర్చించి భవిష్యత్ కార్యాచరణ



జగిత్యాల, 10 మార్చి ((తరంగాలు ప్రతినిధి): జగిత్యాల రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేతగా ఉన్న మాజీ మంత్రి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పార్టీ మారే అవకాశాలపై ఊహాగానాలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. జగిత్యాలలోని ఇందిరా భవన్‌లో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో జీవన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు పార్టీలో, ప్రభుత్వ ప్రోటోకాల్‌లో అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని జీవన్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఇటీవల జరిగిన జగిత్యాల మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఆశించిన ఫలితాలు సాధించకపోవడానికి ఎమ్మెల్యే సంజయ్ కుమారే కారణమని గతంలోనే ఆరోపించిన విషయం తెలిసిందే. పార్టీలో తనకు తగిన గుర్తింపు లభించడం లేదని జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. "ఇంకెంత కాలం ఈ అవమానాలు భరించాలి?" అంటూ ప్రశ్నించారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడం రాజకీయంగా చర్చకు దారితీసింది. ప్రస్తుతం తాను కాంగ్రెస్ పార్టీలో కొనసాగాలా లేదా అనే అంశంపై తుది నిర్ణయం తీసుకోలేదని జీవన్ రెడ్డి తెలిపారు. తన అనుచరులు, కార్యకర్తలతో చర్చించిన తర్వాత భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తానని స్పష్టం చేశారు. ఏ నిర్ణయం తీసుకున్నా ముందుగా మీడియాకు తెలియజేస్తానని అన్నారు.

# బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు..

- ప్రభుత్వంపై కవిత ఆగ్రహం
- నిరాహార దీక్ష నుంచి అర్ధరాత్రి అరెస్ట్‌పై మండిపాటు
- పేదల ఇళ్ల కూల్చివేతపై ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు

హైదరాబాద్, 10 మార్చి (తరంగాలు ప్రతినిధి): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఖమ్మం జిల్లా వెలుగుమట్ల భూదాన్ భూముల బాధితుల పక్షాన నిలబడి రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. నిరాహార దీక్షకు దిగిన తనను పోలీసులు అర్ధరాత్రి అరెస్ట్ చేసి హైదరాబాద్‌కు తరలించడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల కోసం గళమెత్తిన తనను ఉగ్రవాదిలా భావించి అరెస్ట్ చేయడం అన్యాయమని, రేవంత్ రెడ్డి



ప్రభుత్వం పేదల పట్ల కనికరం లేకుండా వ్యవహరిస్తోందని ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన కవిత, వెలుగుమట్లలో పేదలు కష్టపడి కట్టుకున్న ఇళ్లను అధికారులు కూల్చివేసిన తీరును తీవ్రంగా తప్పుబట్టారు. భూదాన్ భూములు అంటే పేదలకు ఇచ్చే భూములేనని, కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆ భూములను పెద్దలకు కట్టబెట్టేందుకే ఇలాంటి చర్యలు చేపడుతోందని ఆమె విమర్శించారు. కూల్చివేసిన చోటే మళ్లీ ఇళ్లను నిర్మించి బాధితులకు న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

రాజ్యాంగ పరిరక్షణ గురించి మాట్లాడే రాహుల్ గాంధీ ఈ ఘటనపై

➤ మిగతా 2వ పేజిలో..

జాతీయ దిన పత్రిక

తరంగాలు

THARANGALU DAILY NEWS

బుధవారం, 11 మార్చి, 2026




## కళాశాలలకు ప్రభుత్వం షాక్..

➢ మొదటి పేజీ తరువాయి

వసూలు చేస్తున్నాయన్న ఆరోపణలు రావడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కొంతమంది కళాశాలలు అధికారికంగా రూ.8,500 వసూలు చేసే అవకాశం ఉన్నప్పటికీ అనధికారికంగా రూ.12,000 నుంచి రూ.16,000 వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఈ విధంగా ప్రతి ఏడాది బీటెక్ కోర్సుల నుంచే రూ.25 కోట్ల నుంచి రూ.35 కోట్ల వరకు అదనపు రుసుములు వసూలు చేస్తున్నారని అంచనా. ఇంజనీరింగ్‌తో పాటు ఇతర కోర్సులను కలిపి చూస్తే ఈ ప్రత్యేక ఫీజుల ద్వారా సుమారు రూ.100 కోట్ల వరకు వసూళ్లు జరుగుతున్నాయని తెలుస్తోంది. దీంతో విద్యార్థులపై పడుతున్న ఆర్థిక భారం తగ్గించేందుకు ట్యూషన్ ఫీజు తప్ప ఇతర రుసుములను అనుమతించకూడదని ప్రభుత్వం నిర్ణయించింది. ఇదిలా ఉండగా కళాశాల యాజమాన్యాలు మాత్రం కొన్ని రకాల ఫీజులను వసూలు చేసేందుకు అనుమతి ఉందని చెబుతున్నాయి. అఖిల భారత సాంకేతిక విద్యామండలి ఇచ్చిన అనుమతులపై కూడా చర్చ జరుగుతోంది. ఈ అంశంపై తెలంగాణ ప్రవేశాలు, రుసుముల నియంత్రణ కమిటీ మరియు విద్యాశాఖ మధ్య స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

## బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు..

➢ మొదటి పేజీ తరువాయి

స్పందించాలని కవిత సూచించారు. ఖమ్మం జిల్లాలో పేదల ఇళ్లను కూల్చివేస్తున్న పరిస్థితిని ఆయన గమనించాలని కోరారు. ఈ అంశంపై ఆయనకు లేఖ రాయనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ చర్యల వల్ల పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె పేర్కొన్నారు. బాధితుల్లో ఇంటర్మీడియట్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు కూడా ఉన్నారని కవిత తెలిపారు. పరీక్షల సమయంలో వారిని రోడ్డున పడేయడం కలెక్టర్, జిల్లా మంత్రులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఈ పోరాటం ఇంతటితో ఆగదని, అవసరమైతే కోర్టులో పిల్ దాఖలు చేసి న్యాయపోరాటం కూడా కొనసాగిస్తామని ఆమె స్పష్టం చేశారు.

## పశ్చిమాసియాలో యుద్ధం పదోరోజు

- ఇరాన్ మౌలిక సదుపాయాలపై ఇజ్రాయెల్ విస్తృత దాడులు
- గల్ఫ్ దేశాలపై ఇరాన్ క్షిపణి, డ్రోన్ దాడులు
- ఉద్రిక్తతలు తగ్గించాలని ఖతార్ పిలుపు

న్యూఢిల్లీ, 10 మార్చి(తరంగాలు ప్రతినిధి): పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం సోమవారం పదోరోజుకు చేరుకుంది. ఇజ్రాయెల్ మరియు ఇరాన్ మధ్య దాడులు, ప్రతిదాడులు కొనసాగుతుండటంతో ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరాన్ లక్ష్యంగా ఇజ్రాయెల్ విస్తృత స్థాయి సైనిక దాడులు చేపట్టింది. టెహ్రాన్, ఇస్ఫహాన్ సహా దక్షిణ ఇరాన్ ప్రాంతాల్లోని పలు మౌలిక సదుపాయాలపై దాడులు నిర్వహించినట్లు ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. ఇజ్రాయెల్ రక్షణ దళాలు విడుదల చేసిన ప్రకటనలో, ఇరాన్‌లోని సైనిక స్థావరాలు మరియు ప్రభుత్వానికి చెందిన కీలక నిర్మాణాలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిపినట్లు తెలిపాయి. ఉగ్రవాద కార్యకలాపాలకు మద్దతు ఇస్తున్న కేంద్రాలపై ఈ దాడులు చేపట్టినట్లు ఇజ్రాయెల్ పేర్కొంది. ఈ దాడులతో పలు ప్రాంతాల్లో తీవ్ర నష్టం సంభవించినట్లు అంతర్జాతీయ వర్గాలు వెల్లడిస్తున్నాయి.మరోవైపు ఇరాన్ కూడా గల్ఫ్ ప్రాంతంలోని కొన్ని దేశాల భూభాగాలపై క్షిపణి మరియు డ్రోన్ దాడులు కొనసాగించింది. ఈ దాడులతో గల్ఫ్ ప్రాంతంలో భయాందోళనలు నెలకొన్నాయి. పలు దేశాలు అప్రమత్త చర్యలు చేపట్టగా, పరిస్థితిని సమీక్షిస్తున్నాయి. ఇరాన్ చర్యలతో ప్రాంతీయ భద్రతపై మరింత ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇరాన్ దాడుల్లో బహ్రెయిన్ ప్రభుత్వానికి చెందిన చమురు సంస్థ బాప్కో రిఫైనరీలో మంటలు చెలరేగినట్లు అధికారులు వెల్లడించారు. దీంతో రిఫైనరీ కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు ప్రకటించారు. ఇదిలా ఉండగా ఉద్రిక్తతలను తగ్గించేందుకు అన్ని పక్షాలు చర్చలకు ముందుకు రావాలని ఖతార్ పిలుపునిచ్చింది. పరిస్థితి మరింత విషమించకుండా దౌత్యపరమైన పరిష్కారం అవసరమని అంతర్జాతీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## డబ్బుల కోసం పసికందును అమ్మేసిన దంపతులు

- వారం రోజుల శిశువు విక్రయం
- అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలి అప్రమత్తతతో బయటపడిన ఘటన
- రూ.1.7 లక్షలకు శిశువును విక్రయించినట్లు అంగీకారం



మెదక్, 10 మార్చి :తరంగాలు ప్రతినిధి): మెదక్ జిల్లాలో హృదయ విదారక ఘటన వెలుగులోకి వచ్చింది. డబ్బుల కోసం కన్నపేగు బంధాన్ని కాసులకు అమ్ముకున్న ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. పుట్టిన వారం రోజులకే తమ మగబిడ్డను విక్రయించి మానవత్వానికే మచ్చ తెచ్చిన ఘటన హవేలీఘనాపూర్ మండలం లింగసానిపల్లి తండాలో జరిగింది. ఈ సంఘటన బయటపడటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల ప్రకారం, లింగసానిపల్లి తండాకు చెందిన ఓ గిరిజన దంపతులకు గత నెల 10వ తేదీన మగబిడ్డ జన్మించాడు. అయితే ఆర్థిక ఇబ్బందులను కారణంగా చూపుతూ పుట్టిన వారం రోజులకే ఆ పసికందును కామారెడ్డి జిల్లాకు చెందిన ఓ దంపతులకు విక్రయించినట్లు తెలిసింది. ఈ ఘటన అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలి అప్రమత్తతతో వెలుగులోకి వచ్చింది. బిడ్డ పుట్టిన తర్వాత తల్లి అంగన్‌వాడీ కేంద్రానికి గుడ్లు, ఇతర పోషకాహారం తీసుకోవడానికి రాకపోవడంతో ఉపాధ్యాయురాలికి అనుమానం కలిగింది. దీంతో ఆమె వారి ఇంటికి వెళ్లి చూడగా తలుపులకు తాళం వేసి ఉండటం గమనించారు. వెంటనే ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించడంతో వారు రంగంలోకి దిగారు. దర్యాప్తులో ఆ గిరిజన దంపతులు మరో గ్రామంలో ఉన్నట్లు గుర్తించారు. వారిని పట్టుకుని బిడ్డ గురించి ప్రశ్నించగా అసలు విషయం బయటపడింది. తమ మగబిడ్డను రూ.1.7 లక్షలకు కామారెడ్డి జిల్లాకు చెందిన దంపతులకు అమ్మేసినట్లు వారు ఒప్పుకున్నారు. దీంతో ఐసీడీఎస్ అధికారులు వారిని హవేలీఘనాపూర్ పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ఒకే ఒక్క ఫోన్ కాల్

- ఇరాన్--ఇజ్రాయెల్ యుద్ధంలో యుఎఇ తటస్థం
- సైనిక ఘర్షణల్లో పాల్గొనే ఉద్దేశం లేదని స్పష్టం
- ఉద్రిక్తతలను తగ్గించడంలో మధ్యవర్తిత్వానికి సిద్ధం
- ప్రధాని మోదీ ఒక్క ఫోన్ కాల్‌తో సమస్య పరిష్కారమవుతుందని వ్యాఖ్య



అబుదాబి, 10 మార్చి (తరంగాలు ప్రతినిధి): మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ తొలి భారత రాయబారి హుస్సేన్ హసన్ మీర్జా కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్--ఇజ్రాయెల్ వివాదంలో పాల్గొనే ఉద్దేశం తమ దేశానికి లేదని ఆయన స్పష్టం చేశారు. ఇరువైపులా జరిగే దాడులకు తమ భూభాగాన్ని స్థావరంగా ఉపయోగించుకోవడానికి అనుమతించబోమని పేర్కొన్నారు. ఈ యుద్ధంలో యుఎఇ జోక్యం చేసుకునే అవసరం లేదని ఆయన తెలిపారు. ఒక వార్తా ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మీర్జా మాట్లాడుతూ అబుదాబి సున్నితమైన భౌగోళిక రాజకీయ స్థానంలో ఉందని చెప్పారు. ఇరాన్‌కు పొరుగు దేశంగా ఉండటంతో పాటు అబ్రహం ఒప్పందాల ప్రకారం ఇజ్రాయెల్‌తో కూడా సంబంధాలు కొనసాగుతున్నాయని వివరించారు. ఈ ప్రత్యేక సంబంధాల వల్ల ఇరువైపుల మధ్య ఉద్రిక్తతలను తగ్గించడంలో యుఎఇ కీలక పాత్ర పోషించే అవకాశం ఉందన్నారు. అవసరమైతే దౌత్య చర్చల ద్వారా మధ్యవర్తిత్వం చేయడానికి తమ దేశం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.యుద్ధంలో పాల్గొనడం కంటే శాంతి, దౌత్యాన్ని ప్రాధాన్యంగా తీసుకుంటామని మీర్జా స్పష్టం చేశారు. ఇరాన్--ఇజ్రాయెల్ యుద్ధంలో పాల్గొనే ఆసక్తి యుఎఇకి లేదని ఆయన తెలిపారు. తమ దేశాన్ని ఈ సంఘర్షణతో ఎందుకు ముడిపెడుతున్నారని కూడా ప్రశ్నించారు. ఉద్రిక్త పరిస్థితులను తగ్గించడానికి చర్చలే ఉత్తమ మార్గమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీతో గల్ఫ్ దేశాల నాయకులకు ఉన్న అనుబంధాన్ని ప్రస్తావించిన మీర్జా, ఈ ప్రాంతంలో మోదీకి విశేష గౌరవం ఉందన్నారు. ఇరాన్ మరియు ఇజ్రాయెల్ నాయకులతో మోదీ చేసే ఒక్క ఫోన్ కాల్ కూడా సమస్య పరిష్కారానికి దోహదపడవచ్చని వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా యుద్ధంలో ప్రాణనష్టం పెరుగుతూనే ఉందని సమాచారం. ఇరాన్ ఐక్యరాజ్యసమితి రాయబారి వెల్లడించిన వివరాల ప్రకారం మరణాల సంఖ్య 1,332కు చేరుకోగా వేలాది మంది గాయపడ్డారు. చికిత్స పొందుతున్న సమయంలో మరో అమెరికన్ సైనికుడు మరణించినట్లు అమెరికా అధికారులు ధృవీకరించారు.

## ఆక్రమణల నుంచి పార్కు రక్షణ.. హైడ్రా చర్యలు

- చందానగర్‌లోని 400 గజాల పార్కు స్థలం కాపాడిన అధికారులు
- జీహెచ్ఎంసీ ప్రహరీనే పునాదిగా చేసుకుని నిర్మాణ యత్నం
- ఫెన్సింగ్ ఏర్పాటు చేసి హైడ్రా బోర్డులు ఏర్పాటు




హైదరాబాద్, 10 మార్చి తరంగాలు ప్రతినిధి): శేరిలింగంపల్లి మండలం చందానగర్ పరిధిలోని భవానీపురం కాలనీలో పార్కు స్థలాన్ని ఆక్రమణల నుంచి హైడ్రా అధికారులు కాపాడారు. కాలనీలో ఉన్న సుమారు 400 గజాల పార్కు స్థలం ఆక్రమణకు గురవుతోందని భవానీపురం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కాలనీలోని పార్కు చుట్టూ జీహెచ్ఎంసీ అధికారులు గతంలో ప్రహరీ గోడ నిర్మించి హద్దులు నిర్ణయించినట్లు స్థానికులు తెలిపారు. అయితే అదే ప్రహరీ గోడను పునాదిగా చేసుకుని కొందరు ఇల్లు నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఫిర్యాదు మేరకు హైడ్రా అధికారులు జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. లేఅవుట్ ప్రకారం ఆ స్థలం పార్కుగా కేటాయించినదేనని నిర్ధారించారు. అనంతరం మంగళవారం ఆక్రమణలను తొలగించి సుమారు 400 గజాల స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. పార్కు స్థలమని స్పష్టం చేస్తూ హైడ్రా బోర్డులను కూడా ఏర్పాటు చేశారు. ఈ స్థలం విలువ సుమారు రూ.2 కోట్ల వరకు ఉంటుందని స్థానికులు అంచనా వేస్తున్నారు. పార్కు స్థలాన్ని కాపాడిన హైడ్రా అధికారులకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.




## మిలియన్ మార్చ్‌కు 15 ఏళ్లు

- తెలంగాణ ఉద్యమాన్ని గుర్తుచేసుకున్న కేటీఆర్
- ట్యాంక్‌బండ్‌పై గర్జించిన లక్షల గొంతుకలు
- తెలంగాణ ఉద్యమంలో కీలక ఘట్టమని వ్యాఖ్య
- అమరవీరులకు నివాళులు అర్పించిన కేటీఆర్





హైదరాబాద్, 10 మార్చి తరంగాలు ప్రతినిధి): స్వరాష్ట్ర సాధన కోసం ట్యాంక్‌బండ్‌పై యావత్ తెలంగాణ ప్రజలు ఏకమై గర్జించి నేటికి 15 సంవత్సరాలు పూర్తయ్యాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమంలో మిలియన్ మార్చ్ ఒక కీలక ఘట్టమని ఆయన పేర్కొన్నారు. స్వరాష్ట్ర సాధన కోసం నాడు తెలంగాణ ప్రజల్లో ఏర్పడిన ఉద్యమ స్ఫూర్తి అపారమైందని తెలిపారు. 2011 మార్చి 10న నిర్వహించిన మిలియన్ మార్చ్ సందర్భంగా ఎన్నో నిర్బంధాలు, దిగ్బంధాలు, అడ్డంకులు ఉన్నప్పటికీ ఉద్యమకారుల సంకల్పాన్ని అవి దెబ్బతీయలేకపోయాయని కేటీఆర్ తెలిపారు. బ్యారికేడ్లు, ఇనుపకంచెలు ఏర్పాటు చేసినా తెలంగాణ కోసం పోరాడిన ప్రజల ఉత్సాహాన్ని ఆపలేకపోయాయని ఆయన అన్నారు. ఆ రోజు లక్షలాది మంది ట్యాంక్‌బండ్‌పై ఒకే స్వరంతో తెలంగాణ కోసం నినదించారని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసేలా చేసిన పోరాట రూపాల్లో మిలియన్ మార్చ్ ఒకటని కేటీఆర్ పేర్కొన్నారు. ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులు, యువత, ప్రజా సంఘాల పాత్రను ఆయన ప్రశంసించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రజలు చూపిన ఐక్యత దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను ఈ సందర్భంగా కేటీఆర్ స్మరించారు. అమరవీరులకు జోహార్లు తెలుపుతూ జై తెలంగాణ అంటూ తన సందేశాన్ని ముగించారు. మిలియన్ మార్చ్ సందర్భంగా తీసిన పాత చిత్రాలను కూడా ఆయన సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు.

## అణగారిన వర్గాల చదువుల తల్లి సావిత్రిబాయి పూలే

•కుడా మాజీ మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి



హన్మకొండ ప్రతినిధి, మార్చి 10,తరంగాలు :అణగారిన వర్గాల చదువుల తల్లి సావిత్రిబాయి పూలే అని కుడా మాజీ మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి అన్నారు .బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.మొదట సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం మర్రి యాదవ రెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు, పీడిత ప్రజలు ముఖ్యంగా స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి తల్లి సావిత్రిబాయి పూలే అని అన్నారు.కులమత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమస్వరూపిణి అని కొనియాడారు.విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన మహనీయురాలు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, మేకల బాబు రావు, కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, సీనియర్ నాయకులు నార్లగిరి రమేష్, సల్వాజీ రవీందర్ రావు, నాయకులు మహమూద్ గౌస్ ఖాన్, కోటేశ్వర్ రావు, అఫ్జల్, సంపతి రఘు, మూటిక రాజు యాదవ్, ఆర్ కే నరేంద్ర, వినయ్, దరిగి రమేష్, గద్దెపాటి సాయి కుమార్, సారిక తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి అండగా ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి



రాయపర్తి, మార్చి 10,తరంగాలు : ఇంటి పెద్దలు కోల్పోయి తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసి అండగా ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి అండగా నిలిచారు.రాయపర్తి మండల కేంద్రంలో కొత్త రాయపర్తికి చెందిన రాగిపెల్లి రాజబాబు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు.వారికి ఇద్దరు ఆడపిల్లలు, భార్య ఉన్నారు.నిరుపేద కుటుంబం కావడం కుటుంబ పెద్ద మరణంతో ఆ కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుందని తెలుసుకున్న ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ 5వేలు ఆర్థిక సహాయం అందజేసి ఆ కుటుంబానికి అండగా నిలిచారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న మాకు ఆర్థిక సహాయం అందజేసి అండగా నిలిచిన ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి, బందెల బాలరాజు, గజావెల్లి ప్రసాద్, మాజీ సర్పంచ్ గారే నర్సయ్య, రాయపర్తి గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి చందు రామ్, పార్టీ ముఖ్య నాయకులు ఉబ్బని సింహాద్రి, పీరని వెంకన్న, ఐత జంపి, గారే విష్ణు, స్థానిక నాయకులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటికన్నె గ్రామంలో రెండవ రోజు ఎన్ఎస్ఎస్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రమేష్ నాయక్

కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా,ప్రతినిధి, మార్చి. 10, తరంగాలు:రెండవ రోజు ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా మంగళవారం రోడ్ క్లీనింగ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశుభ్రమైన పరిసరాలు ,ఆరోగ్యకరమైన జీవితానికి పునాది అన్నారు. మనం రోడ్లను శుభ్రంగా ఉంచితే వ్యాధులు తగ్గి, సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్నారు.ఎన్ఎస్ఎస్ స్వచ్ఛంద సేవకులు సమాజ సేవకు ఎప్పుడూ ముందుండాలి. ఈ కార్యక్రమం ద్వారా మనం, గ్రామ ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నాము. అందరూ కలిసి పరిసరాలను శుభ్రంగా ఉంచడం మన బాధ్యత అన్నారు.




# తొర్రూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 13న జాతీయ సెమినార్





• ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బోలగాని రాములు

తొర్రూర్ మార్చి 10 తరంగాలు

ప్రభుత్వ డిగ్రీ కళాశాల తోరూరులో వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో 13 మార్చి 2026న జాతీయ సదస్సు నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బోలగని రాములు తెలిపారు. మంగళవారం కళాశాలలో జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.ఇన్నోవేషన్ మరియు సస్టైనబిలిటీ ఇన్ బిజినెస్ త్రు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్- ఏ మల్టీ డిసిప్లినరీ రోడ్ మ్యాప్ టు వికసిత్ భారత్ ఏ 2047" అనే సమకాలీన అంశంపై వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో ఒకరోజు జాతీయ సదస్సు ను మన కళాశాల లో మార్చి 13, 2026న నిర్వహించ బోతున్నాము. ఈ కార్యక్రమమునకు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి చీఫ్ గెస్ట్ గా హాజరవు తున్నారు. అలాగే తెలంగాణ యూనివర్సిటీ రిజిస్టర్ ప్రొఫెసర్ ఎం యాదగిరి మరియు కాకతీయ యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ మరియు డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ కామర్స్ ప్రొఫెసర్ కట్ల రాజేందర్ విశిష్ట అతిథులుగా హాజరవు తున్నారు.
2047 వ సంవత్సరానికి మనకు స్వాతంత్రం వచ్చి 100 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంలో భారతదేశం అభివృద్ధి చెందుతున్న దేశం నుండి అభివృద్ధి చెందిన దేశముగా తీర్చిదిద్ద బడడంలో కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ )యొక్క పాత్రను విశ్లేషించడమే ఈ సదస్సు యొక్క ప్రధానమైన లక్షమని తెలిపారు.

ఈ సదస్సు యొక్క ముఖ్యఅంశాలు :

1. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఆధారిత ఆవిష్కరణల ప్రాముఖ్యత కళాశాలలోని వివిధ శాస్త్ర శాఖల ముఖ్య ఉద్దేశము.
2. నూతన ఆవిష్కరణల మేళవింపుతో వికసిద్భారత్ 2047 నాటికి సుస్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను సాధించడం
3. వాణిజ్య, ఆర్థిక, పారిశ్రామిక రంగాలలో నూతనమైన ఆవిష్కరణలతో వ్యవసాయ రంగంలో ఆధునిక పోకడలను సాధిస్తూ... విద్య ,వైద్య, వైజ్ఞానిక రంగాలలో పురోభివృద్ధి సాధిస్తూ... రసాయన సాంకేతిక, కంప్యూటరీ కరన రంగాలలో నైపుణ్యాత్మక వృద్ధి సాధిస్తూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా భౌగోళిక, ఖగోళ శాస్త్ర రంగాలలో సహితం ఏఐ వినియోగం సాధించుట.
4. పరిశ్రమల రంగం అకాడమిక్ రంగాలలో ఏఐ ని భాగస్వామ్యం చేసి వాటిని బలోపేతం చేయడం.
5. బ్యాంకింగ్, మార్కె టింగ్ పరిపాలన, రాజకీయ, చారిత్రక రంగాలలో సహితం ఏ ఐ ఆధారిత అభివృద్ధి సాధించుట,ఆయా రంగాలన్ని టినీ వృద్ధి పథంలో నిలపడము.

ఈ సదస్సునకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్య శాఖ కమిషనర్ దేవసేన అనుమతి అడగగానే లభించినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు.
ఈ సదస్సు నిర్వహణకు రూసా కన్వీనర్ దేవసేన ఫైనాన్షియల్ సపోర్ట్ ను అందజేస్తు న్నందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియ జే శారు .
ఈ జాతీయ సదస్సు కన్వీనర్ మరియు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎస్ .సునీల్ మన కళాశాల 2008లో ఆవిర్భవించబడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు గదులలో 100 విద్యార్థుల లోపు సంఖ్యతో ప్రారంభించబడి 2018లో గేల్ సంస్థ ద్వారా సి ఎస్ ఆర్ ఫండింగ్ సహకారంతో చక్కటి గేటెడ్ రెండంతస్తుల బిల్డింగును ఏర్పరచుకొని 2021 లో ప్రవేశించినది మొదలుకొని 100 విద్యార్థుల నుండి 450 విద్యార్థుల వరకు అడ్మిషన్లు పెంచుకొని మంచి ఫలితాలు సాధిస్తూ సమాజానికి ఉపయుక్త మైన ఎందరో విద్యార్థినీ విద్యార్థులను తీర్చిదిద్దు తున్న విద్యా సంస్థగా ఈ కళాశాల పనిచేస్తున్నది. ఈ కళాశాలలోని విద్యార్థిని విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాముఖ్యత, వాణిజ్య రంగంలో, ఆర్థిక పారిశ్రామిక రంగాలలో దాని యొక్క పాత్ర ,ప్రపంచ పోకడలో వాణిజ్య విభాగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కు ఉన్నటువంటి ప్రాధాన్యతను తెలుసుకొనేటట్టుగా చేయటమే ఈ సదస్సు యొక్క ముఖ్య లక్ష్యం అని అభిప్రాయపడ్డారు.
ఈరోజు వరకు 70కు పైన ఫుల్ లెన్త్ పేపర్స్ ని మరియు 90 కి పైన అబ్స్ట్రాక్స్ ని వివిధ యూనివర్సిటీస్ నుంచి కాలేజీ ల నుంచి శాస్త్రీయ దృక్పథం కలిగిన అధ్యాపకులు విద్యార్థుల ద్వారా సేకరించ గలిగాము. ఈ పేపర్స్ పబ్లిష్ చేయడానికి ప్లాగ్ యారిజం చెకింగ్ తో మంచి ఇంపాక్ట్ ఫ్యాక్టర్ ఉన్నటువంటి పబ్లికేషన్ ద్వారా ప్రచురణ చేయడం జరిగింది. ఈ మొత్తం 70 పరిశోధన పత్రములను రెండు సంపుటాలుగా విభజించి జాతీయ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేయుచున్న ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరణ చేయబోతున్నాము అని తెలిపారు. అంతేకాక మన పాలకుర్తి కాన్స్టెన్సీ లో ఒకే ఒక్క ప్రభుత్వ డిగ్రీ కళాశాల మన కళాశాల కాబట్టి ఈ కళాశాల చేపట్టిన ఈ జాతీయ సదస్సును ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వీకరించి దీన్ని విజయవంతం చేయవలసిందిగా నిర్వహకులు ప్రిన్సిపల్ మరియు విద్యార్థిని విద్యార్థులు కోరుచున్నారు ముఖ్యంగా ప్రెస్ మీడియా లేనిదే ఏ కార్యక్రమమూ విజయవంతం కాదని, అందుకోసం ముందుగానే ప్రెస్ మీట్ ద్వారా ప్రెస్ వారందరి సహకారంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసి దీనిని విజయవంతం చేసే బాధ్యత మీ భుజస్కందాల పై ఉంచుతూ.. ఈ ప్రెస్ మీట్ కి హాజరైన మీడియా సభ్యులందరికీ విజ్ఞప్తి చేయుచున్నాము. అనంతరం సెమినార్ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శాంత్ కుమార్, అధ్యాపకులు డాక్టర్ సుజాత, డాక్టర్ పార్వతి, రవీందర్ రెడ్డి, డాక్టర్ వాల్య నాయక్, డాక్టర్ అంజుం ఆరా, డాక్టర్ ఆర్ సునీల్, శ్రీనివాస్, కృష్ణవేణి, వెంకన్న, విజయ్, రాధిక, రజిత, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

# ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయిల్ యుద్ధాన్ని ఆపివేయాలి

- భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలి
- వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్ లో ఎస్ కే యం ఆధ్వర్యంలో అమెరికా ఇజ్రాయిల్ దిష్టిబొమ్మ దగ్ధం




హన్మకొండ ప్రతినిధి, మార్చి 10,తరంగాలు : గత 11 రోజులుగా నిరాధారమైనటువంటి ఆరోపణలతో ఇరాన్ దేశంపై అమెరికా ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని వెంటనే ఆపేయాలని భారత అమెరికా స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సంయుక్త కిసాన్ మోర్చా ఎస్ కె ఎం జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు అమెరికా ఇజ్రాయిల్ దిష్టిబొమ్మను రైతు సంఘాల నాయకులు తగలబెట్టారు.ఈ సందర్భంగా యుద్ధాన్ని వెంటనే ఆపేయాలని అమెరికా ఇజ్రాయిల్ చేస్తున్న హంతక దాడులను వెంటనే నిలిపివేయాలని ప్రపంచ శాంతి వర్ధిల్లాలని మొదలగు నినాదాలు చేశారు.అనంతరం ఎస్ కే యం జిల్లా కన్వీనర్లు రాచర్ల బాలరాజు, ఇసంపల్లి బాబు, సోమిడి శ్రీనివాస్ మాట్లాడుతూ అమెరికా ఇజ్రాయిల్ దేశాలు ఇరాన్ పై దాడి చేసి మొత్తం ప్రపంచాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేశాన్ని నెట్టివేశాయని వారు విమర్శించారు.నిరాధారమైన ఆరోపణలతో ఇరాన్ అధిపతి అయితుల్ల ఖ మేని తో పాటు నేటికీ 1000 కి పైగా ప్రజలను ఈ దేశాలు చంపివేశాయని వారు అన్నారు.పాఠశాలలు ఆసుపత్రులపై బాంబుల దాడి చేశారని వారు గుర్తు చేశారు.అమెరికా ట్రంప్ ప్రభుత్వం అభివృద్ధి చెందిన దేశాలను తమ గుప్పిట్లో పెట్టుకోవడానికి ఇలాంటి దారుణాలకు చేస్తున్నదని పెట్రో డాలర్ ఆధిపత్య ఆర్థిక నియంత్రణ కోసం కోసమే యుద్ధాలు చేస్తున్నదని వారు ఆరోపించారు.ప్రపంచ శాంతికి శ్రామిక ప్రజలకు అమెరికా అతి పెద్ద శత్రువు అని వారన్నారు.గత ఫిబ్రవరి 6వ తేదీన భారత అమెరికా స్వేచ్ఛ వాణిజ్య మధ్యంతర ఒప్పందం దేశ ప్రజల ప్రయోజనాలకు అనుకూలంగా కాక కార్పొరేట్ ప్రయోజనాల కోసం మోడీ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుందని దీనివల్ల కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలు మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్నదని దేశ ప్రజలు అర్థం చేసుకోవాలని వారు కోరారు.అమెరికా నుండి దిగుమతి చేసుకున్న సరుకులపై సుంఖాలు తగ్గించడం అధిక సంఖ్యలో సబ్సిడీలు ఇవ్వడం వ్యవసాయ ఉత్పత్తులు ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలు భారత మార్కెట్లోకి ప్రవేశించడం అనుమతిస్తున్నదని దీనివల్ల ఇది రైతాంగాన్ని మోడీ ప్రభుత్వం దివాలా తీయించడమేనని వారన్నారు.అలాగే నేటి పార్లమెంటు సమావేశాల్లో విద్యుత్ సవరణ బిల్లు విత్తన బిల్లు భీమా రంగం ప్రైవేటీకరణ మొదలగు ప్రజా వ్యతిరేక బిల్లులు మోడీ ప్రభుత్వం తీసుకు వస్తున్నదన్నారు. అమెరికాకు మోడీ ప్రభుత్వ లొంగుబాటుకు వ్యతిరేకంగా పోరాడాలని వారు ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్కేయం కన్వీనర్ సుధమల్ల భాస్కర్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు జక్కుల తిరుపతి, ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్,అక్క పెల్లి సుధాకర్, మైదంపాని, పెద్దింటి కొమ్మాలు, ఎండి అక్బర్, అప్పనాపురం నరసయ్య, పి డి ఎస్ యు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి , మర్రి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# సిలిండర్ ధరలు తక్షణమే ఉపసంహరించుకోవాలి







**•ఏఐసిటియు వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర రామస్వామి**

వరంగల్ ప్రతినిధి, మార్చి 10,తరంగాలు :కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని కరీమాబాద్ ఎస్బిఐ సెంటర్లో ఎం సిపిఐ యు కరీమాబాద్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎం సిపిఐయు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, ఏఐసిటీయు వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర రామస్వామి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ సిలిండర్ ధర గృహ వినియోగదారులకు 60 రూపాయలు కమర్షియల్ వారికి 115 రూపాయలు పెంచడం జరిగింది ఇప్పటికే పెరిగిన గ్యాస్ ధరల మూలంగా పేద ప్రజలు చిన్న చిన్న కొట్టు వ్యాపారస్తులు హోటల్ యజమానులు రోడ్డుమీద బండ్లల్లో ఇడ్లీ పూరీలు అమ్ముకునే చిన్న వ్యాపారస్తులు బ్రతకలేని స్థితిలో పొట్టకూటి కోసం జీవనం కొనసాగిస్తూ ఉంటే మరోసారి గ్యాస్ ధరలు పెరగడం మూలంగా గ్యాస్ మహిళలు కొనలేని స్థితిలో ఇబ్బందులు ఎదురుకునే పరిస్థితి ఉందన్నారు. ఇక కట్టెలపోయే శరణ్యమని మహిళలు ఆవేదన చెందుతున్నారు ఒక ప్రక్కన ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాల మూలంగా బిజెపి ప్రభుత్వం శాంతిని నెలకొల్పే విధంగా ప్రయత్నం కొనసాగించకుండా దేశంలో నిత్యం పెరుగుతున్న నిత్యావసర వస్తువుల సరుకుల ధరల ను అదుపు చేయకుండా ఆదాని అంబానీ కార్పొరేట్ శక్తుల సంపద పెరగడంకోసం దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టే విధంగా మోడీ విధానాలు కొనసాగుతుందని అన్నారు ఇప్పటికైనా పెంచిన గ్యాస్ ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని లేనిచో రాబోయే రోజులలో పెద్ద ఎత్తున ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కరీమాబాద్ ఏరియా కార్యదర్శి ఐతం నగేష్,ఎగ్గని మల్లికార్జున్, మాలి సత్యనారాయణ, ఏఐఎఫ్డిఎస్ వరంగల్ జిల్లా కార్యదర్శి చుక్క ప్రశాంత్, అమాలి సంఘం నాయకుడు అడుప.యాదగిరి, గార.శివరాజు, భూక్య రమేష్, సోమయ్య, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

## శాంతి యూత్ ఆధ్వర్యంలో పూర్వ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం



కేసముద్రం,మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, మార్చి.10, తరంగాలు:కేసముద్రం మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో శాంతియుత్ ఆధ్వర్యంలో పూర్వ సభ్యులు కలుసుకొని తమ జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఒకరినొకరు ఆప్యాయతంగా పలకరించుకున్నారు.అనంతరం శాంతి యూత్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడు కంది వెంకన్న ఉపాధ్యక్షుడు మంద సాయి బాబా ప్రధాన కార్యదర్శి మెట్టు రవీందర్ రెడ్డి సహాయ కార్యదర్శి ఏ సల్ల వెంకన్న కోశాధికారి ఏ సల్ల అప్పయ్య సలహాదారులు జీజుల వీరభద్రం రాజబోయిన యాదగిరి కోమటిరెడ్డి సాంబ రెడ్డి పిల్లి శ్రీనివాస్ శ్రీరామోజు శివలింగాచారి జోగు రవీందర్ మండే రాజేందర్ జిజుల రవీందర్ ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కంది వెంకన్న మాట్లాడుతూ గత 39 సంవత్సరాలుగా శాంతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సాంస్కృతిక మరియు క్రీడలలో ఎన్నో విజయాలు సాధించి ఉప్పరపల్లి గ్రామానికి కబడ్డీ క్రీడలో రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు తెచ్చిన ఎందరో క్రీడాకారులు కళాకారులకు ప్రత్యేక గుర్తింపు పొందారు అని అన్నారు.. అలాగే శాంతి యూత్ అసోసియేషన్ క్లబ్ అంటేనే మంచికి మారుపేరు శాంతికి నిలయమని ఈ క్లబ్ నుండి అంచలంచలుగా ఎదిగి ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తున్నారని అన్నారు. వృత్తిరీత్యా చాలామందికి సమయం దొరకకపోవడంతో అందరం కలుసుకోలేకపోయామని ఎన్ని పనులు ఉన్నా శాంతి యూత్ అసోసియేషన్ ను మళ్లీ మనమందరం కలిసి పూర్వ వైభవాన్ని చాటాలని అన్నారు. అనంతరం అందరూ కలిసి తమ పాత జ్ఞాపకాలను నెరవేసుకున్నారు. నూతనంగా ఎన్నుకోబడిన వారిని చాలువతో ఘనంగా సన్మానించారు.గత 30 సంవత్సరాలుగా ఉప్పరపల్లి గ్రామానికి సేవలు అందిస్తున్న మండల ఆర్ఎంపీ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పిల్లి శ్రీనివాస్ ను తమ సేవలను గుర్తించి ఘనంగా శాలవతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతోనే లక్ష్యాన్ని సాధించాలి

### సామాజికవేత్త విద్యావేత్త చిర్ర యాకాంతం గౌడ్




కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా,ప్రతినిధి,మార్చి. 10, తరంగాలు:కేసముద్రం మండలం ఇంటికన్నె గ్రామంలో నిర్వహిస్తున్న ఎన్ ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా రెండవ రోజు కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ యూనిట్ ప్రోగ్రాంఆఫీసర్ డా. రమేష్ బాబు గుగులోతు ఆధ్వర్యంలో ముఖ్యఅతిథిగా సామాజికవేత్త విద్యావేత్త చిర్ర యాకాంతం గౌడ్ హాజరయ్యారు. యాకాంతం గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో పాటు తమ విద్యను అభివృద్ధి చేసుకుంటూ స్వశక్తితో తన ఎంచుకున్న లక్ష్యాన్నిచేరుకోవాలని తల్లిదండ్రులను పూజిస్తూ,గురువులను గౌరవించాలని, చదువుతో పాటు సమాజ సమాజంలోజరుగుతున్నటువంటి రుగ్మతలను తెలుసుకొని సన్మార్గంలో ముందుకు నడవాలని ,పట్టుదలతో చదివి పది మందికి సేవ చేసే ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ప్రముఖ సామాజికవేత్త,విద్యావేత్త, వివేకవర్ధిని కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా రెండవ రోజు కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు గ్రామంలో ఉండబడినటువంటి ప్రకృతి వనాన్ని సందర్శించి పరిసరాల పరిశుభ్రత చేయడం జరిగింది. అదేవిధంగా మంగళవారం గ్రామపంచాయతీ ఆవరణంలో మహిళల కోసం మొదటి పాఠశాలను స్థాపించి వారికి అక్షరాభ్యాసాన్ని చేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా వారికి నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మైసయ్య , ప్రవీణ్ , రమాదేవి ,రాజు,యాదగిరి, రవి , సలీం , మంజుల, నాన్ టీచింగ్ వాళ్లు, గ్రామ వార్డు సభ్యులు, విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉచిత గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాలు

జఫర్గడ్ ప్రతినిధి, మార్చ్ 10,(తరంగాలు): తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పశువులలో ఉచిత గాలి కుంటు వ్యాధి నిరోదక టీకాల కార్యక్రమంలో భాగంగా మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ,గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాలను.,గ్రామ ఉప సర్పంచ్ యాదగిరి పశువైద్యాధికారి డాక్టర్ చినపెల్లి రజిత ,కలిసి ప్రారంభించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఆఫీస్ సబర్డినేట్ నరేష్,తదితరులు పాల్గొన్నారు.



# అందరికీ ఆరోగ్య రక్ష,ఆరోగ్య తెలంగాణ 99 రోజులు





మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, మార్చి.10, తరంగాలు:ప్రజా పాలన ప్రగతి ప్రాణాలికలో భాగంగా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కేసముద్రంలో, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ బి రవి రాథోడ్ ఆదేశానుసారం మెటర్నరీ చైల్డ్ హెల్త్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సారంగం శిబిరం ప్రారంభించారు.ఈ స్పెషాలిటీ వైద్య శిబిరంలో, స్త్రీ వైద్య నిపుణులు, ఆర్తో, పీడియాట్రిక్స్, జనరల్ మెడిసిన్, డెంటల్ డాక్టర్, ఆప్తమాలోజి, సంబంధించిన స్పెషాలిటీ డాక్టర్ పాల్గొని, సేవలందించడం అందించడం జరిగింది. ఇవి అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్టు పేర్కొనడం జరిగింది. ఈ శిబిరంలో ప్రజలందరూ పాల్గొని, విజయవంతం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్, నంబి కిషోర్,డాక్టర్ శ్రవణ్ కుమార్,డాక్టర్ ప్రణీత గైనకాలజిస్ట్,డాక్టర్ వైష్ణవి, పిల్లల వైద్య నిపుణురాలు, డాక్టర్ శ్రీవల్లి ఆప్తమాలోజి,డాక్టర్ కుంకుమేశ్వర్,ఆర్థోపెడిక్స్,డెంటిస్ట్ డాక్టర్ మిరాజ్,డాక్టర్ శ్రీరామ్ జనరల్ మెడిసిన్,కె.వి.రాజు,పురుషోత్తం,హెల్త్ ఎడ్యుకేటర్, హెచ్ ఇ వో లౌకియా, ల్యాబ్ టెక్నీషియన్స్ అక్బర్, లావణ్య, హెల్త్ సూపర్వైజర్స్, చారి,మాధవి,ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## ఓబులాపూర్ గ్రామంలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమం



జఫర్గడ్ ప్రతినిధి మార్చ్ 10,(తరంగాలు): తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఈగల్ ఫోర్స్ 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా మండలం లోని ఓబులాపూర్ గ్రామంలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమం గ్రామ సర్పంచ్ దొంతమల్ల సంతోష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా సర్పంచ్ దొంతమల్ల సంతోష్ మాట్లాడుతూ,డ్రగ్స్ అనేది మన యువత భవిష్యత్తును చీకటిలోకి నెట్టే ప్రమాదకరమైన అలవాటు.మన గ్రామాన్ని డ్రగ్స్ రహిత గ్రామంగా మార్చడం మన అందరి బాధ్యత" అని గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు.అనంతరం సిఐ శ్రీనివాసరావు డ్రగ్స్ వల్ల యువతకు, కుటుంబాలకు సమాజానికి కలిగే ప్రమాదాలను స్పష్టంగా వివరించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఎంతో ప్రేరణాత్మకమైన ప్రసంగం చేశారు.అలాగే ఎస్ఐ రామారావుడ్రగ్స్ వల్ల జీవితాలు ఎలా నాశనం అవుతాయో ఉదాహరణలతో వివరించారు.ఈగల్ ఫోర్స్ ఎస్ఐ మానసయువతకు మంచి మార్గంలో నడవాలని, డ్రగ్స్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు.ఫారెస్ట్ ఆఫీసర్ జబీనా బేగంకూడా సమాజంలో డ్రగ్స్ నిర్మూలనకు అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.అలాగే పాఠశాల ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు డ్రగ్స్ వల్ల జరిగే ప్రమాదాలను వివరించి మంచి సందేశాలు ఇచ్చి, ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం డ్రగ్స్కు దూరంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలోఉప సర్పంచ్ ఎంపెల్లి సమ్మయ్య, వార్డ్ సభ్యులు వడ్లకొండ సప్న, లొంక రమ,ఎండి జలీల్ పాషా, చీపురు సాంబరాజు పాల్గొన్నారు.అలాగే గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, విద్యార్థులు మరియు పిల్లల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్కూల్ పిల్లలు చేసిన డాన్సులు నాటికలు డ్రగ్స్ వల్ల జరిగే ప్రమాదాలను హృదయాన్ని కదిలించేలా చూపించాయి.మన గ్రామం డ్రగ్స్ రహిత గ్రామంమన యువత దేశ భవిష్యత్తు డ్రగ్స్ కి గట్టి చెక్ పెట్టి సమాజానికి కొత్త దిశడ్రగ్స్ అనే చీకటినితరిమికొట్టిమన గ్రామ భవిష్యత్తుకు వెలుగులు నింపుదద్దాం మన పిల్లల నవ్వుల కోసండ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం.



## డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సు



జఫర్గడ్ ప్రతినిధి, మార్చ్ 10,(తరంగాలు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండలం కునూర్ గ్రామంలో జడ్ పి హెచ్ యస్ హై స్కూల్ లో పిల్లలభద్రత డ్రగ్స్ కుఅడ్డుకట్టమాదకద్రవ్యాల డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సు వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య, జఫర్గడ్ యస్ ఐ రామారావు, యస్ ఐ మానస అధ్వర్యంలో ఏర్పాటు చేయటం జరిగింది.ఈ కార్యక్రమం లో హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు పర్వేజ్,ఉపాధ్యాయులు , సర్పంచ్ కాటం దేవేంద్ర మల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ సంధ్య శ్రీనివాస్, వార్డు సభ్యులు గ్రామస్తులు ప్రజా ప్రతినిధులు యువకులు పాల్గొనడం జరిగింది.

## వెంటనే మక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి



జఫర్గడ్ ప్రతినిధి, మార్చ్ 10,(తరంగాలు): మండలంలోని వివిధ గ్రామాలలో తెలంగాణ ప్రభుత్వం వెంటనే మక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాపర్తి సోమయ్య పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ కు మక్కాజొన్న కొనుగోలు కేంద్రా లను ఏర్పాటు చేయాలని జఫర్గడ్ మండలం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని కునూరు గ్రామంలో రైతులు పెద్ద ఎత్తున మక్కజొన్న పంటను సాగు చేయడం జరిగింది. ఇప్పటివరకు మక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడే పరిస్థితులు ఉన్నాయని తెలియజేశారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులు ప్రైవేట్ వ్యాపారాలను ఆశ్రయించి తక్కువ ధరకు అమ్ముకునే పరిస్థితి ఉందన్నారు. దీంతో రైతుకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిలే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే ఐకెపి ద్వారా మక్కజొన్న కొనాలని డిమాండ్ చేశారు. ఇట్టి విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని తాసిల్దారుకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి నక్క యాకయ్య, మండల అధ్యక్షులు రాయపురం బిక్షపతి, సంఘం నాయకులు ఎండి భాష, ఇల్లందుల రామస్వామి, శాఖ యాదగిరి, వడ్లకొండ రాజు, నల్ల తీగల శ్రీను, ఆవుల తేజ, అనుముల కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే నాగరాజు



నల్గొండ ప్రతినిధి, మార్చి 10,తరంగాలు :నూతన వధూవరులను ఎమ్మెల్యే నాగరాజు ఆశీర్వదించారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, సీనియర్ న్యాయవాది నిమ్మని శేఖర్ రావు -- విజయ కుమారి కుమార్తె డా. ఆశిత -- డా. ప్రదీప్ ల వివాహ విందు కార్యక్రమం నల్లగొండ జిల్లా లోని లక్ష్మి గార్డెన్స్ నందు జరిగింది. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ , వారి కుటుంబ సభ్యులు మరియు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ మోడల్ స్కూల్‌ను తనిఖీ చేసిన కలెక్టర్



నర్సింహులపేట మార్చి 10 తరంగాలు

ప్రతిష్టాత్మకంగా చేపట్టి నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందనీ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు.మంగళవారం నర్సింహులపేట మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి పిల్లలతో స్వయంగా మాట్లాడారు.99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రజలకు క్షేత్రస్థాయిలో అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు పై కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్, సానిటేషన్, ఫైళ్ళ క్లియరెన్స్, కార్యాలయాల పరిసరాల పరిశుభ్రత లపై ప్రత్యేక దృష్టి పెట్టి జిల్లా వ్యాప్తంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు, తెలంగాణ మోడల్ స్కూల్ నరసింహులపేటలో పిల్లల అందిస్తున్న సౌకర్యాలు, విద్య బోధనలపై పిల్లలతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వం కల్పిస్తున్న కామన్ డైట్ మెనూను పకడ్బందీగా అమలు చేయాలని, పిల్లలు ఆరోగ్యంగా ఉంటే చదువుపై దృష్టి సారించి ముందుకు వెళ్తాన్నారు, సబ్జెక్టుల వారిగా పిల్లల విద్యా సామర్థ్యాలను పరిశీలించాలని వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తమ విద్యా బోధనలు అందించాలని తెలిపారు.ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థుల హాజరు వివరాలను పరిశీలించారు, రానున్న పరీక్షల నేపథ్యంలో షెడ్యూలు ప్రకారం ఏర్పాట్లు చేయాలని, సంబంధిత సిబ్బందికి సూచించారు.జిల్లావ్యాప్తంగా గురువారం జిల్లా స్థాయి అధికారులు అన్ని వసతి గృహాల తనిఖీలు పిల్లలతో కలిసి బ్రేక్ ఫాస్ట్, భోజనం చేసి వారికి అందుతున్న సౌకర్యాలను పరిశీలించి ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించడం జరుగుతుందనీ అన్నారు.జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి దేశీ రామ్ నాయక్, గిరిజన ఆశ్రమ పాఠశాల మహబూబాబాద్, ఆశ్రమ హై స్కూల్, మహాత్మ జ్యోతిరావు పూలే స్కూల్ దంతాలపల్లి, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, కురవి ఐకెపి సెంటర్ లో క్లీనింగ్ అండ్ సానిటేషన్ పనులు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు. జిల్లా పశు వైద్య అధికారి డాక్టర్ కిరణ్ కుమార్, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ జూనియర్ కాలేజ్, మరిపెడ, జిల్లా హార్టికల్చర్ అధికారి జి.మరియాన్న నెల్లికుదురు మండలం కస్తూరిబా గాంధీ విద్యాలయం, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాసరావు, గూడూరు మండలం దామారవంచ, తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు, మహబూబాబాద్ పట్టణంలోని మైనారిటీ రెసిడెన్షియల్ హై స్కూల్, ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భీమ్లా నాయక్, ఎస్సీ ఎస్టీ హాస్టల్ చిన్న గూడూరు, జిల్లా పరిషత్ సీఈవో పురుషోత్తం, మరిపెడ ఎంపీడీవో కార్యాలయం తనిఖీ చేసి సానిటేషన్, ఫైల్ క్లియరెన్స్ చేయించారు.సివిల్ సప్లై డిఎం ఎస్సీ హాస్టల్ ఇనుగుర్తి, వెల్ఫేర్ అధికారిని సబిత ఆశ్రమ హై స్కూల్ కురవి, ప్రాజెక్ట్ డైరెక్టర్ మెప్మా విజయ ఆశ్రమ హైస్కూల్ మహబూబాబాద్, అగ్రికల్చర్ అధికారి, తదితరులు వారికి కేటాయించిన వసతి గృహాలలో తనిఖీ చేసి నివేదికలు అందించారు.

# హైదరాబాద్ నగరానికి ధీటుగా వరంగల్



- వరంగల్ సమగ్రాభివృద్ధికి ప్రత్యేక చర్యలు
- త్వరలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం
- అండర్ గ్రౌండ్ పనులకు శంకుస్థాపన
- యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి పనులు
- వరంగల్ నగరాభివృద్ధిపై జిల్లా ప్రజాప్రతినిధులు
- అధికారులతో మంత్రి పొంగులేటి సుదీర్ఘ సమీక్ష


హైదరాబాద్, మార్చి 10,తరంగాలు : వరంగల్ నగర సమగ్రాభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా పని చేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో వరంగల్ జిల్లా అభివృద్ధిపై దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ హైదరాబాద్ నగరానికి ధీటుగా వరంగల్‌ను అభివృద్ధి పరచాలన్న కృత నిశ్చయంతో వరంగల్ నగర అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. వరంగల్ నగర అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల అమలులో వేగం పెంచాలని ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. హైదరాబాద్ తర్వాత అత్యంత ప్రాధాన్యత కలిగిన ఉమ్మడి వరంగల్ జిల్లాలో చేపట్టిన వివిధ ప్రగతి పనులు వచ్చే జూన్ 2వ తేదీ కల్లా పూర్తి కావాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు నిర్విరామంగా పనిచేయాలని సూచించారు.భద్రకాళి ఆలయ అభివృద్ధి పనులు, భద్రకాళి చెరువు డీ సిల్టేషన్ అంశాలకు సంబంధించి ఆలయ మాడవీధులలో కృష్ణశిలతో నిర్మాణం చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. భద్రకాళి చెరువు హెడ్ రెగ్యులేటర్ వద్ద ఇన్ ఫాల్, అవుట్ ఫాల్ విషయంలో భూ సేకరణను వేగవంతం చేయాలన్నారు.గత ప్రభుత్వం ఆర్భాటంగా శంకుస్థాపన చేసి గాలికి వదిలేసిన వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనులను పూర్తి చేశామని జూన్ నాటికి ప్రజలకు అందుబాటులోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.ఈ ఆసుపత్రి నిర్మాణ పనులు, ఆసుపత్రి సామగ్రి ఏర్పాటు, డాక్టర్ల నుంచి మొత్తం సిబ్బంది నియామకానికి సత్వరమే కార్యాచరణను పూర్తి చేయాలని ఆదేశించారు. ఇన్నర్ రింగ్ రోడ్డు, అవుటర్ రింగ్ రోడ్డుకు అదేవిధంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భూసేకరణను వేగవంతం చేయాలన్నారు.వరంగల్ పట్టణంలో 5,257 కోట్ల రూపాయిలతో చేపట్టే భూ గర్భ డ్రైనేజీ పనులకు సంబంధించి వెంటనే టెండర్ ప్రక్రియను పూర్తి చేసి వచ్చేనెలలో పనులను ప్రారంభించేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న 2 బిహెచ్‌కే ఇండ్లకు ఈనెల 31లోగా లబ్దిదారులను ఎంపిక చేసి కేటాయించాలని సూచించారు. 2బిహెచ్‌కే కాలనీల్లో కరెంట్, డ్రైనేజ్, తాగునీరు, రోడ్లు వంటి కనీస సౌకర్యాలను ఆనాటి ప్రభుత్వం విస్మరించిందని తక్షణమే ఆయా కాలనీల్లో కనీస వసతుల ఏర్పాటు చేయాలని ఇందుకు అవసరమైన బడ్జెట్ ప్రతిపాదనలు పంపిస్తే నిధుల మంజూరు చేస్తానని తెలిపారు.ఈ సమావేశంలో శాసనసభ్యులు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కె ఆర్ నాగరాజు, నాయిని రాజేందర్ రెడ్డి, శాసనమండలి సభ్యులు బస్వరాజు సారయ్య, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, వరంగల్, హన్మకొండ కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, చాహేత్ బాజ్ పాయి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## కుటుంబ సమేతంగా భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న

- ప్రముఖ సీడ్స్ కంపెని అడ్వంటా గ్లోబల్ సప్లై చైన్ డైరెక్టర్ చెరుకు రమేష్ గౌడ్

వరంగల్ ప్రతినిధి, మార్చి 10,తరంగాలు : వరంగల్ లోని శ్రీ భద్రకాళి అమ్మవారిని ప్రముఖ సీడ్స్ కంపెని అడ్వంటా గ్లోబల్ సప్లై చైన్ డైరెక్టర్ చెరుకు రమేష్ గౌడ్ కుటుంబ సమేతంగా దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా వారికి అర్చకులు ఆశీర్వాదాలు అందజేసారు.అనంతరం ఆలయ దర్మకర్తలు తొనుపునూరి వీరన్న, మయూరి రాము వారికి అమ్మవారి శేష వస్త్రం, ప్రసాదాలు అందజేసారు



## మంత్రి పొంగులేటిని కలిసిన వేం నరేందర్ రెడ్డి

- రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైనందుకు శుభాకాంక్షలు
- మర్యాదపూర్వకంగా మంత్రి నివాసంలో భేటీ
- పార్లమెంటులో తెలంగాణ గళం బలంగా వినిపించాలని ఆకాంక్ష



హైదరాబాద్, 10 మార్చి  తరంగాలు (ప్రతినిధి): తాజాగా రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డి రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార మరియు పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వేం నరేందర్ రెడ్డికి రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైనందుకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సేవలో ఆయనకు ఉన్న అనుభవం, నిబద్ధత తెలంగాణ ప్రయోజనాలను దేశ రాజధానిలో బలంగా ప్రతిధ్వనింపజేస్తాయని మంత్రి అభిప్రాయపడ్డారు. రాజ్యసభలో ఆయన పార్లమెంటరీ ప్రస్థానం విజయవంతంగా సాగాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రజా సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావిస్తూ ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని తెలిపారు. ఈ భేటీ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై కూడా చర్చించినట్లు సమాచారం.

## అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తాం : కేటీఆర్

- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల వర్క్‌షాప్ నిర్వహణ
- పార్టీ నేతల సూచనలు, అనుభవాల పంచిక
- ప్రభుత్వ వైఖరిపై తీవ్ర విమర్శలు



హైదరాబాద్, 10 మార్చితరంగాలు (ప్రతినిధి): తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాలు, కొనసాగిస్తున్న అన్యాయాలపై అసెంబ్లీలో గట్టిగా నిలదీయడానికి బీఆర్ఎస్ పార్టీ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఈ విషయాన్ని ఆయన సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించారు. అసెంబ్లీ సమావేశాలను దృష్టిలో ఉంచుకుని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించింది. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నేతలు బండా ప్రకాష్, మధుసూదనాచారి, సబితా ఇంద్రా రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, హరీష్ రావు, రావుల చంద్రశేఖర్ రెడ్డి, ప్రొఫెసర్ నాగేశ్వర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ సభ్యులతో తమ అనుభవాలను పంచుకుంటూ అసెంబ్లీలో ఎలా సమర్థవంతంగా వ్యవహరించాలో సూచనలు చేశారు. ప్రభుత్వ విధానాలు, ప్రజా సమస్యలపై ఎలా స్పందించాలన్న అంశాలపై నేతలు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు మార్గనిర్దేశం చేశారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అసెంబ్లీలో ప్రశ్నించేందుకు పార్టీ సిద్ధంగా ఉందని కేటీఆర్ తెలిపారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ గట్టిగా పోరాడుతుందని ఆయన పేర్కొన్నారు.

## హైదరాబాద్-ముంబై రైలు అనుసంధానం బలోపేతం

- ముద్కేడ్--మెద్చల్ డబ్లింగ్ ప్రాజెక్టులో కీలక ముందడుగు
- బాసర--నవీపేట్ మధ్య 17 కి.మీ రైలుమార్గం ప్రారంభం
- యాత్రికులకు, రవాణాకు మెరుగైన సౌకర్యాలు



హైదరాబాద్, 10 మార్చి తరంగాలు (ప్రతినిధి):: హైదరాబాద్--ముంబై మధ్య రైల్వే అనుసంధానాన్ని బలోపేతం చేసే కీలక అభివృద్ధి చోటుచేసుకుంది. ముద్కేడ్--మెద్చల్ డబ్లింగ్ ప్రాజెక్టులో భాగంగా బాసర నుంచి నవీపేట్ వరకు 17 కిలోమీటర్ల రైలుమార్గాన్ని ప్రారంభించినట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. మొత్తం 221 కిలోమీటర్ల పొడవున్న ఈ ప్రాజెక్టు రైల్వే కనెక్టివిటీని మరింత మెరుగుపరుస్తుందని పేర్కొన్నారు. ఈ కొత్త రైలుమార్గం ప్రారంభంతో హైదరాబాద్--ముంబై మధ్య ప్రత్యామ్నాయ రైల్వే మార్గం బలోపేతం కానుంది. దీనివల్ల ప్రయాణికులకు మరింత సౌకర్యం కలగడంతో పాటు రైల్వే రవాణా సామర్థ్యం కూడా పెరుగుతుందని అధికారులు తెలిపారు. బాసరలోని జ్ఞాన సరస్వతి ఆలయం, తఖ్త్ సచ్ఖండ్ శ్రీ హజూర్ సాహిబ్ గురుద్వారా, షిర్డీ సాయిబాబా ఆలయాలకు వెళ్లే యాత్రికులకు ఈ మార్గం ఎంతో ఉపయోగకరంగా మారనుంది. ఈ మార్గం ద్వారా భక్తులకు ప్రయాణం మరింత సులభం అవుతుందని అధికారులు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తికావడం వల్ల ఈ ముఖ్యమైన రైల్వే కారిడార్‌లో రవాణా సామర్థ్యం పెరగడంతో పాటు ప్రయాణికుల రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారనున్నాయని కేంద్ర మంత్రి తెలిపారు.

## ఉచిత గాలికుంటు వ్యాధి టీకాలు పశువుల పెంపకం దారులు సద్వినియోగం చేసుకోవాలి





- జిల్లా పశు వైద్యాధికారి మజ్జి బాలకృష్ణ
- వర్ధన్నపేటలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి టీకా కార్యక్రమం

వర్ధన్నపేట ప్రతినిధి,మార్చి 10, తరంగాలు :ఉచిత గాలికుంటు వ్యాధి టీకాలు పశువుల పెంపకం దారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు వైద్యాధికారి మజ్జి బాలకృష్ణ అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో పశువుల సంరక్షణకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఎనిమిదవ విడత ఉచిత గాలికుంటు వ్యాధి (ఎఫ్ఎమ్‌డీ) టీకా కార్యక్రమంలో భాగంగా వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని ఫిరంగి గడ్డలో మంగళవారం పశువులకు ఉచిత టీకాలు అందించారు. జిల్లా పశు వైద్యాధికారి మజ్జి బాలకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి తో కలిసి టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా పశు వైద్యాధికారి మాట్లాడుతూ పశువులలో వచ్చే గాలికుంటు వ్యాధి, మేకలు--గొర్రెలలో వచ్చే పి.పి.ఆర్ వ్యాధి, పందుల్లో కనిపించే క్లాసికల్ స్వైన్ ఫీవర్, అలాగే గోసులక్స్ వంటి వ్యాధులను నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం ఉచిత టీకాలు అందిస్తున్నదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈ టీకా కార్యక్రమం అమలు జరుగుతోందని అన్నారు.ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యంగా నాలుగు నెలలు దాటిన దూడలకు టీకాలు వేయించాల్సిన అవసరం ఉందన్నారు. పాలిచ్చే పశువులకు లేదా సూడుతో ఉన్న పశువులకు టీకాలు వేయకూడదనే అపోహలు పూర్తిగా మూఢనమ్మకాలు మాత్రమేనని స్పష్టం చేశారు. టీకాలు వేయించకపోతే పశువులకు తీవ్రమైన నష్టాలు కలిగే అవకాశముందని హెచ్చరించారు.మన దేశీయ జాతి పశు వులు వ్యాధులను తట్టుకునే సామర్థ్యం ఎక్కువగా ఉన్నప్పటికీ టీకాలు తప్పనిసరిగా వేయించుకోవడం అవసరమని పేర్కొన్నారు. పశువుల ఆరోగ్యం రైతుల ఆర్థికాభివృద్ధికి ఎంతో కీలకమని తెలిపారు.ఈ సందర్భంగా ఇలాంటి కార్యక్రమం నిర్వహించేందుకు సహకరించిన మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణికి జిల్లా పశు వైద్యాధికారి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నేతావత్ శిభారాణి-రాజేందర్ , 12వ డివిజన్ కౌన్సిలర్ తిరుపెల్లి వాణి, ఏ.డి.ఇ.ఎం వెంకటేశ్వర్లు, వెటర్నరీ డాక్టర్ రాజేందర్, రైతులు, పట్టణ ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి





- నార్కటిక్ సీఐ ప్రవీణ్ కుమార్

వర్ధన్నపేట ప్రతినిధి, మార్చి 10,తరంగాలు :మత్తు పదార్థాలు జీవితాన్ని నాశనం చేస్తాయని, డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని నార్కటిక్ సీఐ ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద, కట్రీయాల, ఉప్పరపల్లి గ్రామాలలో ఆయా గ్రామాల సర్పంచుల అధ్యక్షతన పిల్లల భద్రత. డ్రగ్స్ కు అడ్డుకట్ట అనే కార్యక్రమం ద్వారా విద్యార్థులతో పాటు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వర్ధన్నపేట ఎస్సై సాయిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నార్కటిక్ సీఐ ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.మాదక ద్రవ్య రహిత సమాజాన్ని సాధించేందుకు అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యువత జీవితాలను ఛిద్రం చేస్తున్న ఈ మాదక ద్రవ్యాలకు అందరూ దూరంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాల నిరోధంలో పోలీస్, ఇతర అధికారులు చేస్తున్న కృషికి అందరూ సహకరించి ఈ అక్రమ మాదక ద్రవ్యాల రవాణా అరికట్టాలని పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల సమాజంలో అరాచకాలు, హింసాత్మక ఘటనలు పెరిగిపోతున్నాయన్నారు. డ్రగ్స్ చాక్లెట్లు, ఇతర లిక్విడ్స్ రూపంలో ఎక్కడైనా తారస పడితే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు.ఎస్సై సాయి బాబు మాట్లాడుతూ సమాజాన్ని డ్రగ్స్ రహితంగా మార్చడంలో ప్రజల సహకారం ఎంతో ముఖ్యమని అన్నారు.అదేవిధంగా పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్‌ను, కుటుంబ వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీస్తోందన్నారు. పరిసర ప్రాంతాల్లో ఎక్కడ మాదకద్రవ్యాల వినియోగం, విక్రయాలు కనిపించినా టోల్ ఫ్రీ నెంబర్ 1098 సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం ఇచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిఒక్కరూ పోరాడాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎస్ఐ లు సాయిబాబు, మేరుగు రాజు,ఇల్లంద సర్పంచ్ బేతి సాంబయ్య,కాట్రీయాల సర్పంచ్ రమ్య -రాజు , ఉప్పరపల్లి సర్పంచ్ సినపెల్లి రాజు,ఉప సర్పంచ్ బొచ్చు జ్యోతి యాదగిరి , కార్యదర్శి రామారావు, డాక్టర్ సురేష్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయుల బృందం, పోలీస్ సిబ్బంది, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.








THARANGALU DAILY NEWS
బుధవారం, 11 మార్చి, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

## రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పల్లవి మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



పర్వతగిరి, మార్చి 10,తరంగాలు :మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల కేంద్రంలో ఈనెల 7 నుండి 9 వరకు నిర్వహించిన 69వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ సాఫ్ట్‌బాల్ అండర్--14 బాలబాలికల టోర్నమెంట్‌లో వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్‌లోని పల్లవి మోడల్ స్కూల్ విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు.ఈ పోటీలలో పాఠశాలకు చెందిన విద్యార్థినులు డి.ఎస్. సింధు మరియు జి. నందిని వరంగల్ జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించి రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నారు. వారు అద్భుతమైన ఆటతీరుతో సెమీఫైనల్ వరకు చేరుకుని పాఠశాలకు మంచి పేరు తీసుకువచ్చారు. రాష్ట్ర స్థాయిలో పాల్గొని ప్రతిభ కనబరిచిన ఈ విద్యార్థినులను పాఠశాల తరపున అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేసి సన్మానించారు. అలాగే పి.ఇ.టి ప్రశాంత్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ రాచకొండ అశోక్ చారి , కరస్పాండెంట్ గంజి మహేందర్ , డైరెక్టర్ రమేష్ , స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ ఆకుల రాజు పాల్గొన్నారు.ఈ సందర్భంగా చైర్మన్ మరియు కరస్పాండెంట్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించి పాఠశాలకు, జిల్లాకు మరింత మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థినులను అభినందించారు.

## ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య



న్యూఢిల్లీ, మార్చి 10,తరంగాలు : న్యూఢిల్లీలో మల్లికార్జున ఖర్గే ను వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల తెలంగాణ మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలిగా పార్టీ సీనియర్ నాయకురాలు ఎర్రబెల్లి స్వర్ణను ఏఐసీసీ అధిష్ఠానం నియమించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య తో కలిసి ఎర్రబెల్లి స్వర్ణ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకానికి తగిన విధంగా మహిళా కాంగ్రెస్‌ను బలోపేతం చేయడానికి కృషి చేస్తానని ఎర్రబెల్లి స్వర్ణ తెలిపారు. తెలంగాణలో మహిళల రాజకీయ భాగస్వామ్యాన్ని మరింత పెంచుతూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కట్టుబడి పనిచేస్తామని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, మహిళా కాంగ్రెస్ కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించారు.

## ప్రమాదంలో కోచ్ దిలీప్ భవితవ్యం?

టీ20 ప్రపంచకప్ 2026లో భారత జట్టు తిరుగులేని విజయాన్ని సాధించి ముచ్చటగా మూడోసారి విశ్వవిజేతగా నిలిచింది. ఈ చారిత్రాత్మక విజయం తర్వాత ఆటగాళ్లపై కాసుల వర్షం కురుస్తోంది. అజేయంగా టోర్నీని ముగించిన సూర్యకుమార్ యాదవ్ సేనకు బీసీసీఐ ఇప్పటికే రూ.131 కోట్ల భారీ నజరానా ప్రకటించింది. అయితే, ఒకవైపు ఈ సంబరాలు జరుగుతుం డగానే.. మరోవైపు జట్టులోని ఒక కీలక వ్యక్తి భవితవ్యంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఆయనే టీమిండియా ఫీల్డింగ్ కోచ్ టి.దిలీప్.భారత జట్టు ప్రపంచకప్ గెలిచినప్పటికీ, టోర్నీ పొడవునా టీమిండియా ఫీల్డింగ్ తీరు విమర్శలకు గురైంది. ఈ టోర్నీలో అత్యధిక క్యాచ్‌లు చేజార్చిన జట్టుగా భారత్ నిలవడం ఆందోళన కలిగిస్తోంది. ఫైనల్‌లో కూడా ఫీల్డింగ్ తప్పిదాలు స్పష్టంగా కనిపించాయి. 2021 నుంచి జట్టుతో ఉన్న టి. దిలీప్ కాంట్రాక్ట్ జూన్ 2026తో ముగియనుంది. ఈ నేపథ్యంలో, అతనిని కొనసాగిస్తారా లేక కొత్త ముఖాన్ని వెతుక్కుంటారా అన్నది ఇప్పుడు బీసీసీఐ ముందున్న పెద్ద ప్రశ్న. వాస్తవానికి, టి.దిలీప్ ప్రస్థానం ఎన్నో మలుపులతో సాగింది. రాహుల్ ద్రవిడ్ హయాంలో ఎంట్రీ ఇచ్చిన ఆయన, 2024 టీ20 వరల్డ్ కప్ తర్వాత తప్పుకోవాల్సి ఉంది. అయితే అప్పుడు ఆయన పదవీకాలాన్ని మార్చి 2025 వరకు పొడిగించారు. ఆస్ట్రేలియా పర్యటనలో ఫీల్డింగ్ వైఫల్యాల వల్ల మధ్యలోనే ఆయనను తొలగించినప్ప టికీ, కెప్టెన్ రోహిత్ శర్మ జోక్యం చేసుకుని గౌతమ్ గంభీర్, బోర్డుని రిక్వెస్ట్ చేయడంతో దిలీప్‌కు మరో ఏడాది ఎక్స్‌టెన్షన్ లభించింది. ఇంగ్లాండ్ పర్యటన నుంచి ఆయన మళ్లీ బాధ్యతలు చేపట్టారు. కానీ ఇప్పుడు వరల్డ్ కప్ ముగియడం, ఫీల్డింగ్ ప్రమాణాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో బోర్డు పునరాలోచనలో పడింది.గతంలోనే టి.దిలీప్‌కు ప్రత్యామ్నాయంగా విదేశీ ఫీల్డింగ్ కోచ్ కోసం బీసీసీఐ వేట సాగించింది. కానీ సరైన అభ్యర్థి దొరకకపోవడంతో మళ్లీ దిలీప్‌కే అవకాశం ఇచ్చారు. హైదరాబాద్‌కు చెందిన దిలీప్, 2007 నుంచి 2019 వరకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌లో, ఆపై ఎన్ సీఏలో పనిచేసిన అనుభవం ఉన్నప్పటికీ.. ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో ఇతర జట్లతో పోటీ పడాలంటే మరింత అధునాతన ఫీల్డింగ్ మెళకువలు అవసరమని బోర్డు భావిస్తోంది. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కోసం కూడా కొత్త కోచ్‌ల కోసం దరఖాస్తులు ఆహ్వానించడం చూస్తుంటే, టీమిండియా ప్రధాన జట్టులోకి కూడా కొత్త ఫీల్డింగ్ కోచ్ వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

# వెలుగుమట్ల బాధితులకు ఇండ్ల స్థలాల పట్టాలు త్వరలో అధికారక ప్రకటన





తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో : ఖమ్మం: వెలుగుమట్ల కూల్చివేత బాధితుల్లో అర్హులైనవారికి బుధవారం పంపిణీ చేసే ఇంటి స్థలం పట్టాలకు సంబంధించిన భూమి ఏ ప్రాంతంలో ఉంది? ప్రభుత్వం ఏ స్థలాన్ని లబ్ధిదారులకు ఇవ్వాలని నిర్ణయించింది. ఇదీ ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న చర్చ.వెలుగుమట్ల భూదాన్ భూముల్లో గత నెల 24వ తేదీన ఇండ్లు కూల్చేసిన అంశంలో ప్రభుత్వం భారీ స్థాయిలో ఆరోపణలను, విమర్శలను మూటగట్టుకుందనే అంశం నిర్వివాదం. రాజకీయంగా పూడ్చుకోలేని స్థాయిలో నష్టం అప్రతిష్టను మూటగట్టుకున్న ఈ ఘటనలో ప్రస్తుతం నష్ట నివారణ చర్యలు చేపట్టినట్లు స్పష్టంగానే కనిపిస్తోంది. ఈమేరకు బుధవారం దాదాపు 350 మందికి ఇంటి స్థలాల పట్టాలను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు పంపిణీ చేస్తారని అధికారిక షెడ్యూల్ కూడా విడుదలైంది. అయితే వెలుగుమట్ల బాధితులకు ఇండ్ల స్థలాలు ఎక్కడ కేటాయిస్తున్నారనేదే అసలు చర్చగా మారింది. సేకరించిన విశ్వసనీయ సమాచారం ప్రకారం... ఎక్కడైతే ఇండ్లను కూల్చాలరో.. అదే ప్రదేశంలోనే అర్హులైన పేదలకు ఇంటి స్థలం పట్టాలను అందించనున్నారు. మొత్తం 9.00 ఎకరాల విస్తీర్ణంలో సుమారు 350 మందికి వెలుగుమట్ల భూదాన్ భూముల్లోనే ఇంటి స్థలం పట్టా కాగితాలను ప్రదానం చేయనున్నారు. ప్రతి లబ్ధిదారునికి 75 చదరపు గజాల విస్తీర్ణపు స్థలాన్ని కేటాయిస్తూ పట్టా కాగితాలు తయారైనట్లు విశ్వసనీయ సమాచారం. అయితే ఈ విషయం అధికారికగా ధ్రువపడాల్సి ఉంది.

# మత్తు పదార్థాలు జీవితాన్ని నాశనం చేస్తాయి





- డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలి
- మాదక ద్రవ్యాల వినియోగంపై విద్యార్థులకు అవగాహన సదస్సు
- ఖాజిపేట ఏసీపీ పి. ప్రశాంత్ రెడ్డి, ఈగల్ ఫోర్స్ తెలంగాణ టీమ్ ఏసిపి నర్సింగరావు

హన్మకొండ ప్రతినిధి, మార్చి 10,తరంగాలు :మత్తు పదార్థాలు జీవితాన్ని నాశనం చేస్తాయని, డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని ఖాజిపేట ఏసీపీ పి. ప్రశాంత్ రెడ్డి, ఈగల్ ఫోర్స్ తెలంగాణ టీమ్ ఏసిపి నర్సింగరావు సూచించారు . విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం(డ్రగ్స్ ), మత్తు పదార్థాల వనం వల్ల కలిగే అనర్థాలపై హాసన్ పర్తి, వంగపహాడ్, మల్లారెడ్డిపల్లి, నాగారం గ్రామలలోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం సీఐ చేరాలు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఖాజిపేట ఏసీపీ పి. ప్రశాంత్ రెడ్డి మరియు ఈగల్ ఫోర్స్ తెలంగాణ టీమ్ ఏసిపి నర్సింగరావు హాజరై మాట్లాడారు గుడుంబా, బెల్లం, గంజాయి, డ్రగ్స్ వినియోగించడం వల్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నట్లు తెలిపారు.ఇలాంటి వాటికి విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. ఉన్నత లక్ష్యంతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రగ్స్ అనే మహమ్మరీ యువత భవిష్యత్తులో నాశనం చేస్తుందని హెచ్చరించారు. గంజాయి విక్రయం, వినియోగంపై పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. గ్రామంలో ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం తెలియజేయాలని పిలుపునిచ్చారు. వంగపహాడ్ గ్రామంలోని ప్రధాన కూడలిలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.ఇట్టి కార్యక్రమానికి నిర్వహించినందుకు స్థానిక ప్రజలు పోలీస్ అధికారులకు సన్మానించారు.ఈ కార్యక్రమంలో హాసన్ పర్తి సిఐ చేరాలు, ఎస్సై రవి, దేవేందర్ లు రెవెన్యూ అధికారులు, ప్రజా ప్రతినిధులు, వఇఎఅంవ సిబ్బంది, మెడికల్ సిబ్బంది, ప్రభుత్వ పాఠశాల సిబ్బంది,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# కేజీబీవి పాఠశాల సందర్శించిన మంత్రి పొన్నం ప్రభాకర్





- పదవ తరగతి విద్యార్థులకు ప్రోత్సాహం

హనుమకొండ ప్రతినిధి,మార్చి 10, తరంగాలు : హుస్నాబాద్ నియోజకవర్గం భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్‌లోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవి) పాఠశాలను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులతో మాట్లాడిన మంత్రి, వచ్చే నాలుగు రోజులు ఎంతో కీలకమైనవని పేర్కొన్నారు. విద్యార్థులు పూర్తి శ్రద్ధతో చదివి మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణతో చదువుకుంటూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని మంత్రి పరిశీలించారు. భోజన నాణ్యత, వంటశాల నిర్వహణ, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల గురించి పాఠశాల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.అనంతరం కేజీబీవి విద్యార్థులతో కలిసి మంత్రి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులతో సత్సంభాషణ జరిపి వారి చదువులు, వసతి సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. విద్యార్థుల అభ్యాసానికి ప్రభుత్వం అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ రవి, డీఈఓ సంబంధిత శాఖల అధికారులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ కొరతతో తెలుగు రాష్ట్రాల్లో హోటల్ రంగం ఆందోళన

- వాణిజ్య సిలిండర్ల సరఫరా నిలిపివేత ప్రభావం
- హోటళ్ల బంద్‌కు హెచ్చరికలు
- ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్



హైదరాబాద్, 10 మార్చితరంగాలు (ప్రతినిధి):
పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ ప్రభావం ఇప్పుడు తెలుగు రాష్ట్రాల హోటల్ రంగంపై కూడా పడుతోంది. వాణిజ్య గ్యాస్ సిలిండర్ల కొరత కారణంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని హోటళ్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. కమర్షియల్ గ్యాస్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయాలని పెట్రోలియం కంపెనీలు డీలర్లకు ఆదేశించడంతో హోటల్ యజమానులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే బెంగళూరు, ముంబై, ఢిల్లీ వంటి నగరాల్లో పలు హోటళ్లు తాత్కాలికంగా మూతపడిన నేపథ్యంలో ఇదే పరిస్థితి తెలుగు రాష్ట్రాల్లో కూడా ఏర్పడే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. కమర్షియల్ గ్యాస్ సరఫరా నిలిచిపోవడంతో తమ వ్యాపారాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని తెలంగాణ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి తెలిపారు.సికింద్రాబాద్‌లో తెలంగాణ హోటల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. గ్యాస్ కొరత సమస్యకు ప్రభుత్వం వెంటనే పరిష్కారం చూపకపోతే రాష్ట్రవ్యాప్తంగా హోటళ్ల బంద్‌కు దిగే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ఇదే పరిస్థితి ఆంధ్రప్రదేశ్‌లో కూడా కనిపిస్తోంది. విశాఖపట్నంలో వాణిజ్య సిలిండర్ల కొరత తీవ్రంగా ఉందని విశాఖ హోటల్ మర్చంట్ సంఘం అధ్యక్షుడు బాలకృష్ణ తెలిపారు. సిలిండర్ల సరఫరా మరింత తగ్గే అవకాశముందని, ఇప్పటికే కొన్నిచోట్ల బ్లాక్ మార్కెట్ జరుగుతోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గ్యాస్ కొరతపై విశాఖ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు హోటల్ వ్యాపారులు తెలిపారు. హోటల్ రంగం తీవ్ర సంక్షోభంలో పడకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చర్యలు తీసుకుని గ్యాస్ సరఫరాను సాధారణ స్థితికి తీసుకురావాలని వ్యాపారులు కోరుతున్నారు.

## ఏటీఎం నగదు ఎత్తుకెళ్లిన డ్రైవర్ అరెస్ట్

- రూ.56 లక్షలతో పారిపోయి లగ్జరీ జీవితం
- 11 రోజుల్లో రూ.22 లక్షలు ఖర్చు చేసిన నిందితుడు
- ప్రేయసి ఆధారంగా పోలీసులకు చిక్కిన డ్రైవర్



హైదరాబాద్, 10 మార్చితరంగాలు (ప్రతినిధి):
సమయానికి జీతం రాకపోవడం, విలాసవంతమైన జీవితం గడపాలనే ఆశతో ఓ డ్రైవర్ దొంగగా మారిన ఘటన హైదరాబాద్‌లో వెలుగులోకి వచ్చింది. ఏటీఎంలకు నగదు సరఫరా చేసే వాహనం నుంచి రూ.56 లక్షలు ఎత్తుకెళ్లిన డ్రైవర్ చివరకు పోలీసులకు చిక్కాడు. నిందితుడు 11 రోజుల్లోనే రూ.22 లక్షలు ఖర్చు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా బొమ్మనహాల్‌కు చెందిన అజిత్ సికింద్రాబాద్‌లో నివసిస్తూ సంగం సెక్యూరిటీ సొల్యూషన్స్ సంస్థలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఏటీఎంలలో నగదు నిర్వహణ పనుల్లో భాగంగా అతడు వాహనం నడిపేవాడు. ఈ ఏడాది ఫిబ్రవరి 12న గచ్చిబౌలి పరిధిలోని గోపన్‌పల్లి ఏటీఎంలో నగదు జమ చేసేందుకు వెళ్లిన సమయంలో ఇతర సిబ్బంది ఏటీఎంలోకి వెళ్లగా, వాహనంలో ఉన్న అజిత్ నగదుతో పరారయ్యాడు. వ్యాన్‌ను తెల్లాపూర్ గద్దర్ సర్కిల్ వద్ద వదిలేసిన అజిత్ నగదు పెట్టెను తీసుకుని మరో ప్రాంతానికి వెళ్లాడు. లాడ్జిలో దిగిన అనంతరం పెట్టెను కోసి అందులోని రూ.56 లక్షలను తీసుకున్నాడు. అనంతరం బళ్లారి, బెంగళూరు, పుణె, ముంబయి, సోలాపూర్ వంటి ప్రాంతాల్లో తిరుగుతూ లగ్జరీ హోటళ్లలో బస చేశాడు. క్యాబ్‌లలో ప్రయాణిస్తూ పబ్‌లకు వెళ్లి రోజుకు సగటున రూ.2 లక్షల వరకు ఖర్చు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేపట్టి అతని కదలికలపై నిఘా పెట్టారు. విశాఖపట్నంలో ఉన్న తన ప్రేయసితో అజిత్ మాట్లాడిన ఫోన్ కాల్స్ ఆధారంగా పోలీసులు అతడి వివరాలు సేకరించారు. అనంతపురంలోని సోదరి ఇంటికి వెళ్లిన అజిత్ తర్వాత శంషాబాద్ విమానాశ్రయం ప్రాంతానికి చేరుకున్న సమయంలో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు అనంతరం నిందితుడి వద్ద నుంచి రూ.34 లక్షలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మూడు నెలలుగా జీతం రాకపోవడం, డబ్బులపై ఆశ పెరగడం వల్లే ఈ దొంగతనం చేసినట్లు విచారణలో వెల్లడైంది. డ్రైవర్ల నియామకంలో సరైన జాగ్రత్తలు తీసుకోలేదనే కారణంతో సంబంధిత సంస్థపై కూడా చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

## కల్తీ పాల ఘటనపై సీబీఐ దర్యాప్తు చేయాలి: మార్గాని భరత్

రాజమండ్రి, 10 మార్చి తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో కల్తీ పాల ఘటనలో బాధితులను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ పరామర్శించారు. రాజమండ్రిలోని బొల్లినేని ఆసుపత్రికి వెళ్లి బాధితుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మార్గాని భరత్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ నేతలు ఈ ఘటనను తేలికగా తీసుకుంటున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా లోకేశ్, పవన్ కళ్యాణ్, మంత్రి సత్యకుమార్ వంటి నాయకులు బాధిత కుటుంబాల గురించి పట్టించుకోవడం లేదని అన్నారు. ఈ ఘటనను ప్రమాదంగా చూపించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.పాలలో కల్తీ ఎలా జరిగింది అనే అంశంపై ఇప్పటివరకు స్పష్టత లేదన్నారు. పాలలో యూరియా కలిసిందా, ఫార్మాలిన్ కలిసిందా లేదా ఎవరో కావాలనే పురుగుమందు కలిపారా అనే విషయాలు వెల్లడించాల్సిన అవసరం ఉందన్నారు.

## సరదాలపై కాదు మీ లక్ష్యాలపై దృష్టి పెట్టండి






- వర్ధన్నపేట ఏసీపీ అంబటి నరసయ్య

వర్ధన్నపేట ప్రతినిధి,మార్చి 10, తరంగాలు : మత్తు పదార్థాలు అలవాటు సరదాగా మొదలై నీ జీవితాలను సర్వనాశనం చేస్తాయని,సరదాలపై కాదు... మీ లక్ష్యాలపై దృష్టి పెట్టాలని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నరసయ్య సూచించారు. మంగళవారం తెలంగాణ ప్రభుత్వం మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "పిల్లల భద్రత -- డ్రగ్స్‌కు అడ్డుకట్ట" కార్యక్రమంలో భాగంగా వర్ధన్నపేట మున్సిపల్ పట్టణ కేంద్రంలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. వర్ధన్నపేట ఏసీపీ అంబటి నరసయ్య ఆధ్వర్యంలో, మున్సిపల్ చైర్‌పర్సన్ పాలకుర్తి సారంగపాణి నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది.పట్టణంలోని వివేకానంద విగ్రహం వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ, విద్యార్థులు, అధికారులు, ప్రజల భాగస్వామ్యంతో అంబేద్కర్ విగ్రహం వరకు సాగింది. విద్యార్థులు మాదకద్రవ్యాల నిర్మూలనపై నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొని ప్రజల్లో అవగాహన కల్పించారు. అనంతరం ఎంఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో "మాదకద్రవ్యాల నిర్మూలన -- పిల్లల భద్రత, మత్తు పదార్థాలకు అడ్డుకట్ట" అనే అంశంపై అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏసీపీ అంబటి నరసయ్య మాట్లాడుతూ, సమాజంలో ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాల ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. చిన్న వయసులోనే మంచి అలవాట్లు అలవరుచుకుంటే భవిష్యత్తు బలంగా ఉంటుందని అన్నారు. మొదట్లో మత్తు పదార్థాలు ఆనందాన్ని ఇస్తాయని భావించినా, కాలక్రమంలో అవి శారీరకంగా, మానసికంగా తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తాయని వివరించారు.డ్రగ్స్ వల్ల నరాలు క్షీణించడం, గుండె, కాలేయం, జీర్ణాశయం వంటి ముఖ్య అవయవాలు దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారు తమ మనసుపై నియంత్రణ కోల్పోతారని పేర్కొన్నారు. డ్రగ్స్ రెండు రకాలుగా ఉంటాయని, అందులో సింథటిక్ డ్రగ్స్ మరియు గంజాయి మొక్కల ద్వారా లభించే మత్తు పదార్థాలు ఉన్నాయని తెలిపారు.విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయ భూములకు వెళ్లినప్పుడు గంజాయి మొక్కలను గుర్తించి వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మాదకద్రవ్యాల రవాణా లేదా విక్రయాలపై అనుమానం వచ్చినప్పుడు వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని తెలిపారు. ఈ నంబర్‌కు సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని చెప్పారు.

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని, ఈనాటి విద్యార్థులే రేపటి సమాజానికి ఆదర్శ పౌరులుగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఏసీపీ అంబటి నరసయ్య, మెడికల్ ఆఫీసర్లు, తహసీల్దార్ విజయసాగర్, ఎంపీడీవో వెంకటరమణ, ఎంఈఓ శ్రీధర్,నార్కటిక్ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎంఈఓ శ్రీధర్, మున్సిపల్ చైర్‌పర్సన్ పాలకుర్తి సారంగపాణి, వైస్ చైర్‌పర్సన్ శిభారాణి-రాజేందర్ , ఎస్ఐలు సాయిబాబు, రాజు,సర్పంచ్ చిటూరి రాజు,కౌన్సిలర్లు, రెవెన్యూ, వైద్య, విద్యాశాఖ అధికారులు, విద్యార్థులు పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## డ్రగ్స్ మీ లక్ష్యాలకు అడ్డుకట్ట




- సరదాకోసం కూడా డ్రగ్స్‌ను ముట్టుకోవద్దు.
- ఎట్టిపరిస్థితుల్లోనూ డ్రగ్స్ జోలికి వెళ్లకండి




- డ్రగ్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కలిగి ఉండండి
- డ్రగ్స్ రవాణా, వినియోగం మీ దృష్టికి వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వండి
- నార్కోటిక్ ఏసీపీ బుచ్చయ్య
- సరదాల కంటే కెరీర్ చాలా ముఖ్యం
- రాయపర్తి ఎస్సై ముత్యం రాజేందర్

రాయపర్తి, మార్చి 10,తరంగాలు :డ్రగ్స్ వాడటం మీ లక్ష్యాలకు అడ్డుకట్ట అని,సరదాకోసం కూడా డ్రగ్స్‌ను ముట్టుకోవద్దని నార్కోటిక్ ఏసీపీ బుచ్చయ్య అన్నారు.తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా వరంగల్ జిల్లా రాయపర్తి కార్యక్రమాలు నిర్వహించారు.ముందుగా ఎస్సై ముత్యం రాజేందర్ ఆధ్వర్యంలో రాయపర్తి మండల కేంద్రంలో పోలీసుల ఆధ్వర్యంలో మండలంలోని మైలారం, కొండూరు, కొత్తూరు గ్రామాలలో ఈ అవగాహన ప్రజలు విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ ప్రదర్శించారు.ఈ సందర్భంగా నార్కోటిక్ ఏసిపి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల యువతకు మత్తు పదార్థాల వల్ల కలిగే ప్రమాదాలను వివరించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. గంజాయి, మద్యపానం, ధూమపానం, జూదం వంటి దుర్వ్యసనాలు వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబానికి, సమాజానికి కూడా తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయని వారు వివరించారు. ముఖ్యంగా యువత చిన్న వయస్సులోనే చెడు అలవాట్లకు అలవాటు పడితే వారి భవిష్యత్తు తీవ్రంగా దెబ్బతింటుందని హెచ్చరించారు. రాయపర్తి ఎస్సై రాజేందర్ మాట్లాడుతూ సరదాల కంటే కెరీర్ చాలా ముఖ్యమని అన్నారు.మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని,ఒక్క క్షణం ఆలోచిస్తే...మీరు జీవితంలో అత్యున్నత స్థాయికి ఎదుగుతారన్నారు. క్షణికమైన ఆనందం కోసం డ్రగ్స్ జోలికి వెళ్లి మీ జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు.మత్తుకంటే జీవితంలో గెలుపు ఆనందాన్ని ఇస్తుందని గుర్తుంచుకోవాలని అన్నారు.డ్రగ్స్, గంజాయి రహిత సమాజం నిర్మించడం మనందరి బాధ్యత అని,మత్తు పదార్థాలకు అలవాడు పడితే ప్రాణాలు కోల్పోతారన్నారు.ఎవరైనా గం జాయి, డ్రగ్స్ అక్రమ రవా ణా, విక్రయం లేదా విని యోగం చేస్తూ కనిపించిన ట్లయితే 1908 టోల్ ఫ్రీ నెంబర్ లేదా డయల్ 100 కు వెంటనే సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వ్యక్తిగత వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతామ న్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో కిషన్ నాయక్, మెడికల్ ఆఫీసర్ డా.అరుణ్ చంద్ర, సర్పంచ్ గారే సహేంద్ర బిక్షపతి, ఉప సర్పంచ్ మచ్చ రమేష్, వార్డు మెంబర్లు, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయుల బృందం, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

